SAMAYAM

epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక

epaper.samayamdaily.net APTEL/2006/18267
సమయం
మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ప్రజాదరణ పొందుతున్న సమయం న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రికకు విలేకరులు కావలెను.

ఆసక్తి అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు.


జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారీగా ఆర్సీ ఇంచార్జీలు, మండలాల వారీగా విలేకరులు కావలెను.సీనియర్లకు ప్రాధాన్యం కొత్తవారికి అవకాశం ఉంటుంది.

ఫోన్ నెం : 99483 13985/ 89789 60131

సంపుటి : 18 సంచిక : 266 ఎడిటర్ : విక్రం కుమార్ బుధవారం 04, మే 2025 ప్రచురణ : హైదరాబాద్ పేజీలు: 8 వెల: రూ.5

# హెచ్‌టీ కనెక్షన్లపై కరెంటు బిల్లుల మోత!

## 'పవర్ ఫ్యాక్టర్' సాకుతో ఆర్థికభారం



- ఇక కొత్త విధానంలో యూనిట్ల లెక్కింపు
- కెపాసిటర్లు అమర్చుకోవాలంటూ వినియోగదారులకు డిస్కంల నోటీసులు
- పరిశ్రమల యాజమాన్యాల ఆందోళన

**జూన్ 03, సమయం న్యూస్, హైదరాబాద్:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(202526)లో కరెంటుఛార్జీలు పెంచలేదని చెబుతున్న విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లు పరోక్షంగా బిల్లుల భారం మోపుతున్నాయి. ప్రధానంగా హైటెన్షన్(హెచ్‌టీ) కరెంటు కనెక్షన్లున్న పరిశ్రమలు, వాణిజ్యసంస్థలపై అధిక ఆర్థికభారం పడేలా చర్యలు చేపడుతున్నాయి. కనెక్షన్ తీసుకున్న సమయంలో వినియోగదారులు అడిగిన వాస్తవలోడు కన్నా ఎక్కువ కరెంటును వినియోగిస్తున్నారని.. దీనిని నియంత్రించేందుకు 3 నెలల్లోగా కెపాసిటర్లను ఏర్పాటుచేసుకోవాలని నోటీసులు ఇస్తున్నాయి.

**కేవీఏఆర్‌హెచ్ విధానంతో..!**

హెచ్‌టీ కనెక్షన్లకు వినియోగిస్తున్న కరెంటును 'కిలోవాట్ అవర్ (కేడబ్ల్యూహెచ్)' విధానంలో ఇంతకాలం లెక్కించగా ప్రస్తుతం 'కిలోఓల్ట్ యాంపియర్ రియాక్టివ్ అవర్ (కేవీఏఆర్‌హెచ్)' విధానంలో లెక్కిస్తున్నట్లు డిస్కంలు చెబుతున్నాయి.

తరువాయి 2లో



## పంద్రాగస్టు నాటికి భూసమస్యల పరిష్కారం

**జూన్03, సమయం న్యూస్, ఖమ్మం:** స్వాతంత్ర్య దినోత్సవమైన పంద్రాగస్టు నాటికి రాష్ట్రంలోని రైతులకు ధరణి పోర్టల్ నుంచి విముక్తి కల్పిస్తామని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆ తేదీ నాటికి

తరువాయి 2లో

- ఐపీఎల్ ఫైనల్లో పంజాబ్
- క్వాలిఫయర్ 2లో ముంబయిపై విజయం
- శ్రేయస్ అద్భుత ఇన్నింగ్స్

## మానసిక రోగులకు
# కలుషితాహారం కాటు!



- ఎర్రగడ్డ ఆసుపత్రిలో ఒకరి మృతి.. మరో 70 మందికి అస్వస్థత
- నమూనాలను పరీక్షలకు పంపిన అధికారులు

**జూన్03, సమయం న్యూస్, హైదరాబాద్:** హైదరాబాద్ ఎర్రగడ్డలోని మానసిక ఆరోగ్య కేంద్రంలో ఒక రోగి మృతి చెందడంతోపాటు మరో 70 మంది అస్వస్థతకు గురి కావడం మంగళవారం కలకలం రేపింది. వివిధ వార్డుల్లో చికిత్స పొందుతున్న 71 మంది మానసిక రోగులు సోమవారం మధ్యాహ్నం భోజనం అనంతరం అస్వస్థతకు గురయ్యారు. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా మారడంతో ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. మిగిలిన వారికి ఆసుపత్రిలోనే చికిత్స అందిస్తున్నారు. డిశ్చార్జి కమిటీ (డీసీ) వార్డులో ఉంటున్న భూపాలపల్లికి చెందిన కరణ్ (30) అనే వ్యక్తి తీవ్ర అస్వస్థతతో మంగళవారం ఉదయం చనిపోవడంతో ఈ సంఘటన వెలుగులోకి వచ్చింది. ఉస్మానియా నుంచి


తరువాయి 2లో

## వానలపై
# అప్రమత్తంగా ఉండాలి

- సమస్యాత్మక ప్రాంతాల్లో ముందస్తు చర్యలు
- అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలు

**జూన్03, సమయం న్యూస్, హైదరాబాద్:** ఈసారి వర్షాలు సాధారణం కంటే ఎక్కువగా కురిసే అవకాశాలున్నాయని వాతావరణశాఖ సూచిస్తున్న నేపథ్యంలో.. అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ఆయన మంగళవారం సమీక్ష నిర్వహించారు. ''మాన్‌సూన్ ఎమర్జెన్సీ బృందాలు

తరువాయి 2లో





# కనుల ముందు కలల కప్పు

- ఎట్టకేలకు ఆర్సీబీకి ఐపీఎల్ టైటిల్
- ఫైనల్లో పంజాబ్‌పై విజయం

**జూన్03, సమయం న్యూస్ :** విరాట్ కోహ్లి కప్పు కల నెరవేరింది. బెంగళూరుదే ఐపీఎల్ 18 టైటిల్. మంగళవారం ఆసక్తికరంగా సాగిన ఫైనల్లో ఆర్సీబీ 6 పరుగుల తేడాతో పంజాబ్ కింగ్స్‌పై విజయం సాధించింది. మొదట బెంగళూరు 9 వికెట్లకు 190 పరుగులు చేసింది. కోహ్లి (43; 35 బంతుల్లో 3×4) టాప్ స్కోరర్. మిగతా బ్యాటర్లు తలా కొన్ని పరుగులు చేశారు. అర్ష్‌దీప్, జేమీసన్ చెరో మూడు వికెట్లు పడగొట్టారు. వైశాఖ్ (1/30) పొదుపుగా బౌలింగ్ చేశాడు. ఛేదనలో పంజాబ్ 7 వికెట్లకు 184 పరుగులే చేయగలిగింది. కృనాల్ పాండ్య (2/17) అద్భుత బౌలింగ్‌లో ఆర్సీబీ విజయంలో కీలక పాత్ర పోషించాడు. భువనేశ్వర్ (2/38) కూడా రాణించాడు. శశాంక్ సింగ్ (61 నాటౌట్; 30 బంతుల్లో 3×4, 6×6) టాప్ స్కోరర్. తడబడిన పంజాబ్: 8.2 ఓవర్లలో 72/1తో మంచి పునాదే వేసుకుంది పంజాబ్. ప్రియాంశ్ (24) ఔట్ కాగా.. మరో ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ (26)కు తోడైన ఇంగ్లిస్ (39; 23 బంతుల్లో 1×4, 4×6) దంచడం మొదలు పెట్టాడు. బ్యాటర్లు మరీ చెలరేగకపోయినా.. పంజాబ్ ఇన్నింగ్స్ సాఫీగా సాగుతున్న దశ అది. కానీ ఆ జట్టు ఇన్నింగ్స్ అనూహ్యంగా కుదుపునకు లోనైంది. సూపర్ ఫామ్‌లో ఉన్న కెప్టెన్ శ్రేయస్, ఇంగ్లిస్ వికెట్లు

తరువాయి 2లో

## 7న రాష్ట్రవ్యాప్తంగా
# 'యోగా డే' అవగాహన ర్యాలీలు




- 14న లక్ష ప్రాంతాల్లో యోగా సాధన
- ట్రాఫిక్ సహా ఏ ఇబ్బందీ ఉండకూడదు: సీఎం

**జూన్03, సమయం న్యూస్, అమరావతి:** రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 7న 'యోగా డే' అవగాహన ర్యాలీలు నిర్వహించాలని అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. 14న రాష్ట్రంలో లక్ష ప్రాంతాల్లో యోగా సాధన చేయాలని సూచించారు. 21న విశాఖలో 5 లక్షల మంది పాల్గొనేందుకు ఏర్పాట్లు పక్కగా జరగాలని ఆదేశించారు. ప్రధాని నరేంద్రమోదీ రాక సందర్భంగా ట్రాఫిక్ పరంగా ఆంక్షలు ఉంటాయని, వీటిని దృష్టిలో పెట్టుకుని ఇబ్బంది లేకుండా చూడాలని సూచించారు. ఉండవల్లి క్యాంపు కార్యాలయంలో సీఎం చంద్రబాబు మంగళవారం యోగా డే పై సమీక్షించారు. '21న రాష్ట్రంలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ యోగా డే కార్యక్రమానికి ప్రజల నుంచి వస్తున్న స్పందన ఎంతో ఉత్సాహాన్ని ఇస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా

తరువాయి 2లో

# పోలవరం.. డబుల్ ఇంజిన్ వేగం!

- మారిన ముఖచిత్రం.. 2027 చివరకు పూర్తయ్యే దిశలో..
- ఏడాదిలో సాంకేతిక సమస్యలన్నీ కొలిక్కి
- డయాఫ్రం వాల్ పనులు, బట్రస్ డ్యాం పనులు ముందుకు



2లో

epaper.samayamdaily.net
APTEL/2006/18267
సమయం
మన గొంతుకే.. మన పత్రిక
తెలుగు దినపత్రిక



# 7న రాష్ట్రవ్యాప్తంగా 'యోగా డే' అవగాహన ర్యాలీలు

(మొదటిపేజీ తరువాయి)

ఇప్పటివరకు జరిగిన రిజిస్ట్రేషన్లు, జిల్లాల్లో జరుగుతున్న యోగా సాధన కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యం సంతృప్తికరంగా ఉంది. పూర్తిస్థాయి సన్నద్ధతతో అత్యధిక మందితో యోగా నిర్వహించి గిన్నిస్ వరల్డ్ రికార్డు సృష్టించాలనే లక్ష్యాన్ని పూర్తిచేయాలి' అని ఆదేశించారు.

**వర్షం కురిసినా ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు**

21న విశాఖలో వర్షం కురిసినా ఇబ్బంది లేకుండా జర్మన్ హ్యాంగర్లతో మరో వేదికను సిద్ధం చేసినట్లు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ప్రతి గ్రామం నుంచి యోగాలో పాల్గొనేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని వైద్యారోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు తెలిపారు. 'యోగా కార్యక్రమంలో మూడు రోజుల పాటు పాల్గొనేవారికి ధ్రువీకరణ పత్రాలు ఇస్తున్నాం. యాప్ ద్వారా కూడా ప్రజలు వీటిని పొందొచ్చు. విద్యార్థులు, మహిళలు, డ్వాక్రా సంఘాల సభ్యులు, సామాన్య ప్రజలు... ఇలా అన్ని వర్గాలు విశాఖలో జరిగే కార్యక్రమంలో పాల్గొననున్నారు. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో 2 కోట్ల మంది యోగా కార్యక్రమంలో పాల్గొంటారని అంచనా. ఇప్పటివరకు 1.77 కోట్ల మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు' అని ముఖ్యమంత్రికి వివరించారు.

# వానలపై అప్రమత్తంగా ఉండాలి

(మొదటిపేజీ తరువాయి)

24 గంటలూ అందుబాటులో ఉండేలా చూడాలి. నీరు నిలిచిపోయే అవకాశమున్న 141 ప్రదేశాల్లో వాటర్ హార్వెస్టింగ్ వెల్స్ పనులను వేగవంతం చేయాలి. వెల్స్‌లోకి చేరే వర్షపు నీటిని పంపులతో బయటకు పంపించేలా చర్యలు తీసుకోవాలి. వర్షాలు, వరదల పర్యవసానాలపై కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి పర్యవేక్షించేందుకు ఒక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలి. వర్షాలు పడినప్పుడు హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్, ఇతర సమస్యలు తలెత్తకుండా పోలీస్, ట్రాఫిక్, హైడ్రా, జీహెచ్ఎంసీ విభాగాలు అప్రమత్తంగా ఉండాలి. నాలుగు విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేసి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి. అసంపూర్తిగా ఉన్న నాలాల పూడికతీత పనులు వీలైనంత త్వరగా పూర్తి చేయాలి. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి ముందస్తు చర్యలు తీసుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి. ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న కోర్ అర్బన్ రీజియన్‌లో సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక దృష్టి పెట్టాలి. ఈ రీజియన్ పరిధిలోని చెరువులు, నాలాలు, రోడ్ల విస్తరణ, అభివృద్ధికి సంబంధించి ప్రత్యేక పాలసీని తయారు చేసే అంశాన్ని పరిశీలించాలి'' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎంఓ అధికారులు శేషాద్రి, మాణిక్ రాజ్, జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్, హైడ్రా కమిషనర్ రంగనాథ్, హెచ్ఎండీఏ తదితర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# పంద్రాగస్టు నాటికి అన్ని భూసమస్యల పరిష్కారం

(మొదటిపేజీ తరువాయి)

భూభారతి చట్టం ద్వారా అన్ని రకాల భూ సమస్యలను పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం ములుగుమాడు గ్రామంలో మంగళవారం జరిగిన రెవెన్యూ సదస్సుకు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావులతో కలిసి హాజరయ్యారు. ములుగుమాడులో భూముల రీసర్వే ప్రక్రియ గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిర్వహించిన సభలో పొంగులేటి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 413 గ్రామాలకు నక్షా కూడా లేదన్నారు. ములుగుమాడు తరహాలోనే నక్షాలు లేని ఐదు గ్రామాలను ఎంపిక చేసి భూముల రీసర్వేకు శ్రీకారం చుట్టామని పేర్కొన్నారు. దేశంలోని ఐదు ప్రముఖ సంస్థలకు ఈ బాధ్యతలు అప్పగించామని వెల్లడించారు. రెండు విధానాల (డ్రోన్లు, క్షేత్రస్థాయి సర్వే) ద్వారా రీసర్వే పూర్తిచేసి ప్రతి గ్రామానికి నక్షాను రూపొందిస్తామని వివరించారు. ప్రతి రైతు భూమికి కొలతలు వేసి, హద్దులు నిర్ణయిస్తామన్నారు. రాబోయే 35 రోజుల్లో లైసెన్స్‌డ్ సర్వేయర్లు ఆయా గ్రామాల్లో సర్వే చేస్తారని తెలిపారు. 3, 4 రోజుల్లోనే రాష్ట్రంలో 3,556 మంది రెవెన్యూ అధికారులను నియమిస్తామని చెప్పారు.

# ఐరాస సర్వప్రతినిధి సభ కొత్త అధ్యక్షురాలిగా అనలీనా



ఐరాస: ఐక్యరాజ్య సమితి సర్వప్రతినిధి సభకు కొత్త అధ్యక్షురాలిగా జర్మనీ విదేశాంగ శాఖ మాజీ మంత్రి అనలీనా బేబాక్ అత్యధిక మెజార్టీతో ఎన్నికయ్యారు. రహస్య బ్యాలెట్ ద్వారా ఓటింగు జరగాలన్న రష్యా డిమాండుకు అనుగుణంగా సభ్య దేశాలు ఆమెను ఎన్నుకున్నాయి. ఈ ఎన్నికకు మెజారిటీ మార్కు 88 ఓట్లు కాగా.. అనలీనా దాదాపు రెట్టింపు స్థాయిలో 167 ఓట్లు సాధించారు. మరో అభ్యర్థి అయిన జర్మన్ దౌత్యవేత్త హెల్గా ష్మిడ్‌కు 7 ఓట్లే పోలయ్యాయి. 14 దేశాలు ఓటింగుకు గైర్హాజరయ్యాయి. సెప్టెంబరులో జరిగే ఐరాస సర్వప్రతినిధి సభ 80వ సమావేశంలో ప్రస్తుత అధ్యక్షుడు ఫిలెమాన్ యాంగ్ నుంచి అనలీనా ఈ బాధ్యతలు స్వీకరించనున్నారు. 193 దేశాల సభ్యత్వం కలిగిన ఐరాస సర్వప్రతినిధి సభకు అధ్యక్షులుగా ఏడాదికి ఒకరిని ప్రాంతాల వారీగా ఎన్నుకుంటారు.

# ఈశాన్యాన్ని ఆదుకుంటాం: మోదీ

దిల్లీ: భారీ వర్షాలకు అతలాకుతలమైన ఈశాన్య రాష్ట్రాలను అన్నివిధాలా ఆదుకుంటామని ప్రధాని నరేంద్ర మోదీ హామీ ఇచ్చారు. గత కొద్దిరోజులుగా ఎడతెరిపిలేని వానలతో జనజీవనం అస్తవ్యస్తమైన నేపథ్యంలో అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ, సిక్కిం సీఎం ప్రేమ్‌సింగ్ తమాంగ్, మణిపుర్ గవర్నర్ అజయ్‌కుమార్ భల్లాలతో మంగళవారం ఆయన ఫోన్లో మాట్లాడి పరిస్థితి తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. ఈశాన్య రాష్ట్రాల్లో వరద ఉద్ధృతి కొనసాగుతోంది. ఇప్పటివరకు 40 మంది చనిపోగా, దాదాపు 6 లక్షల మందికిపైగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సిక్కింలో వేర్వేరు ప్రాంతాల్లో చిక్కుకుపోయినవారిని రక్షించేందుకు వాయుసేన రంగంలోకి దిగింది. రెండు ఎంఐ17 హెలికాప్టర్ల ద్వారా 34 మందిని కాపాడింది. 23 మందితో కూడిన ఎన్డీఆర్ఎఫ్ బృందం సిక్కింకు చేరుకుంది. కొండచరియలు విరిగిపడటం వల్ల గల్లంతైన ఆరుగురు సైనికుల ఆచూకీని తెలుసుకోవడం, తాత్కాలిక సమాచార వ్యవస్థ ఏర్పాటుసహా వివిధ రూపాల్లో ఈ దళం చేయూత అందిస్తోంది.

# హెచ్‌టీ కనెక్షన్లపై కరెంటు బిల్లుల మోత!

(మొదటిపేజీ తరువాయి)

కేవీఏఆర్‌హెచ్ విధానంలో.. ఒక హెచ్‌టీ కనెక్షన్‌కు రోజూ వినియోగించే కరెంటు వాస్తవలోడు ఎంతనేది పరిశీలించి ఆ ఓల్టేజి ప్రకారం యూనిట్లను లెక్కిస్తున్నారు. దీంతో నెలవారీ బిల్లులు భారీగా పెరిగిపోతున్నాయి. పరిశ్రమలు, వాణిజ్యసంస్థలు చెల్లించే బిల్లులు సాధారణంగా రూ.లక్షల నుంచి రూ.కోట్లలో ఉంటాయి. వీటిపై 10శాతం పెరిగినా భారీగా ఆర్థికభారం పడుతోందని ఆయా యాజమాన్యాలు ఆందోళన చెందుతున్నాయి. కరెంటు పంపిణీ, సరఫరా, వాణిజ్య (టీడీసీ) నష్టాలను తగ్గించుకునేందుకే ఈ విధానంలో కరెంటు వినియోగాన్ని లెక్కించి బిల్లులు జారీచేస్తున్నట్లు డిస్కంలు చెబుతున్నాయి. అదే 'కేడబ్ల్యూహెచ్'లో లెక్కిస్తే ఒక పరిశ్రమ వాస్తవంగా వినియోగించిన కరెంటు యూనిట్ల కంటే తక్కువ యూనిట్లకు బిల్లులు జారీఅవుతున్నట్లు పేర్కొంటున్నాయి.

**'ల్యాగ్', 'లీడ్' కలిపి..**

అన్నివర్గాల కనెక్షన్లకు వాడుతున్న కరెంటును గ్రిడ్ నుంచి తీసుకుంటారు. ఇందులో 2 రకాలుంటాయి. కేవీఏఆర్‌హెచ్ విధానానికి సంబంధించి.. వీటిలో ఒకటి 'ఇండక్టివ్ రియాక్టివ్ ఎనర్జీ ల్యాగ్'.. మరొకటి 'కెపాసిటివ్ రియాక్టివ్ ఎనర్జీ లీడ్'. వేర్వేరు సమయాల్లో ఆయా కనెక్షన్లపై పడుతున్న కరెంటులోడు ప్రకారం ఇలా 'ల్యాగ్', 'లీడ్' అని వ్యవహరిస్తుంటారు. ఈ రెండింటినీ కలిపి మీటర్లలో పరిశీలించి ఆ కనెక్షన్‌పై వాడిన కరెంటు ఎన్ని యూనిట్లనేది లెక్కించి నెలవారీ బిల్లులు జారీచేయాలి. అయితే ఇంతకాలం మీటర్లలో 'లీడ్'ను లెక్కించకుండా బ్లాక్‌చేసి.. 'ల్యాగ్'ను మాత్రమే లెక్కించి బిల్లులు జారీచేస్తున్నట్లు రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్‌సీ)కి డిస్కంలు ఇచ్చిన నివేదికలో తెలిపాయి. దీనివల్ల టీడీసీ నష్టాలు అధికంగా వస్తున్నాయని, వాస్తవ ఓల్టేజి తేలక తరచూ కరెంటుసరఫరాలో అంతరాయాలు ఏర్పడుతున్నట్లు పేర్కొన్నాయి. నష్టాలు తగ్గించాలంటే 'ల్యాగ్', 'లీడ్' కలిపి లెక్కిస్తేనే వాస్తవంగా ఎంత కరెంటు వాడుకున్నారనేది తేలుతుందని వివరించగా ఈఆర్‌సీ అనుమతించింది. ఈ మేరకు ఎత్తిపోతల పథకాలు మినహాయించి మిగిలిన ప్రతి హెచ్‌టీ కనెక్షన్ మీటర్‌లో 'లీడ్'ను కూడా లెక్కించాలని డిస్కంలు నిర్ణయించాయి.

**పవర్ ఫ్యాక్టర్..!**

హెచ్‌టీ కనెక్షన్లపై వాడుతున్న కరెంటు ఓల్టేజీని తెలిపే 'పవర్ ఫ్యాక్టర్ (పీఎఫ్)' ఎప్పుడూ 0.95 ఉండేలా కెపాసిటర్లను ఏర్పాటుచేసుకోవాలి. పలు హెచ్‌టీ కనెక్షన్లను తనిఖీ చేసినప్పుడు ఇంతకన్నా చాలాతక్కువగా పీఎఫ్ నమోదవుతున్నట్లు డిస్కంలు గుర్తించాయి. ప్రభుత్వరంగానికి చెందిన రైల్వే పీఎఫ్ కూడా 0.95 కన్నా తక్కువగా ఉందని డిస్కంలు ఈఆర్‌సీకిచ్చిన తనిఖీల నివేదికలో పేర్కొన్నాయి. తనిఖీల్లో నగరంలోని ఒక ప్రైవేటు పరిశ్రమకు సగటు పీఎఫ్ లోడు 0.06 మాత్రమే ఉన్నట్లు గుర్తించాయి. అంటే ఆ పరిశ్రమకు వాడుతున్న కరెంటు కన్నా 92.14 శాతం అదనంగా లోడు పడుతున్నట్లు డిస్కం నిర్ధారించింది. ఇలా గ్రేటర్ హైదరాబాద్ చుట్టుపక్కల 190 హెచ్‌టీ కనెక్షన్లను నమూనాగా తనిఖీచేస్తే 160కిపైగా కనెక్షన్లకు సంబంధించి అదనపు కరెంటు వినియోగమవుతున్నట్లు తేలిందని, ఇలాంటివాటిని నియంత్రించకపోతే టీడీసీ నష్టాలు అధికంగా వస్తాయని డిస్కంలు ఈఆర్‌సీకి తెలిపాయి. ఏ హెచ్‌టీ కనెక్షన్‌కు అయినాసరే వరుసగా 2నెలల పాటు పీఎఫ్ 0.95 కన్నా తక్కువలోడుతో వినియోగిస్తే.. వెంటనే మరుసటి 3 నెలల్లోగా దానిని 0.95 స్థాయికి తెచ్చేలా వినియోగం ఉండాలి. ఇందుకుగాను కెపాసిటర్లను అమర్చుకోవాలని డిస్కంలు చెబుతున్నాయి. లేకపోతే 3 నెలల్లోగా మీటర్‌లో 'లీడ్'ను అన్‌బ్లాక్ చేసి వాస్తవ కరెంటు వినియోగాన్ని గుర్తించి బిల్లులు జారీచేస్తామని డిస్కంలు వినియోగదారులకు ఇస్తున్న నోటీసుల్లో తెలిపాయి. అయితే 'ఇంతకాలం ల్యాగ్, లీడ్ కలిపి లెక్కించకుండా డిస్కంలు ఎందుకు వదిలేశాయి? ఇప్పుడు ఆ సాంకేతిక కారణాలు చూపిస్తూ బిల్లుల భారం మోపడం ఎంతవరకు సమంజసం' అని పరిశ్రమల యాజమాన్యాలు ప్రశ్నిస్తున్నాయి. ఉన్నపళంగా ఆర్థికభారం మోపడం సమంజసం కాదని, బిల్లులు పెంచవద్దని డిస్కంలను కోరుతున్నాయి.

**కెపాసిటర్లు తప్పనిసరి: డిస్కంలు**

''కేవీఏఆర్‌హెచ్ విధానంలో బిల్లుల జారీకి 202425లోనే ఈఆర్‌సీ అనుమతించింది. ఇప్పటికిప్పుడు హెచ్‌టీ కనెక్షన్లకు కరెంటు సరఫరా నిలిపివేయడం లేదు. వాటికిఉన్న మీటర్లలో పవర్ ఫ్యాక్టర్ 0.95 కన్నా తగ్గితే రాబోయే 3 నెలల్లోగా సరిచేసుకోమని మాత్రమే నోటీసులు ఇస్తున్నాం. ఈమేరకు కెపాసిటర్లను అమర్చుకోవాలి'' అని దక్షిణ ఉత్తర డిస్కంల సీఎండీలు ముషారఫ్, వరుణ్‌రెడ్డి తెలిపారు.

# మానసిక రోగులకు కలుషితాహారం కాటు!

(మొదటిపేజీ తరువాయి)

ప్రత్యేక బృందాన్ని రప్పించి పర్యవేక్షిస్తున్నారు. మిగిలిన బాధితుల పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. సోమవారం రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆసుపత్రిలో ప్రత్యేకంగా చక్కెర పరమాన్నం చేశారు. దీంతోపాటు అన్నం, కూర, అరటి పండ్లు, గుడ్లను రోగులకు వడ్డించారు. సాయంత్రం డీసీ వార్డు, కోర్టు వార్డుల్లో మొత్తం 71 మంది రోగులకు వాంతులు, విరేచనాలు కావడంతో వైద్యాధికారులు వారికి చికిత్స అందించారు. డీసీ వార్డులో ఉన్న కరణ్ జ్వరం, ఇతర సమస్యలతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. బాధితుల్లో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండడంతో ఉస్మానియా ఆసుపత్రిలో



చికిత్స అందిస్తున్నారు. ఎర్రగడ్డ ఆసుపత్రిలో నల్లా నీటిని ఆర్వో ప్లాంట్లకు పంపి.. వాటి ద్వారా రోగులకు సరఫరా చేస్తున్నారు. స్టీలు బిందెల్లో పట్టిన ఆ నీటిని రోగులు గ్లాసులతో ముంచుకుని తాగుతుంటారని అధికారులు తెలిపారు. ఇలా తాగునీరు కలుషితమైందా అనే కోణంలోనూ పరిశీలిస్తున్నారు. ఈ సంఘటనకు కారణాలు తెలుసుకునేందుకు నమూనాలను పరీక్షలకు పంపామని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనిత చెప్పారు. నా అనేవారు లేక.. పుట్టుకతోనే బుద్ధిమాంద్యం ఉన్న కరణ్.. మానసిక సమస్యలతో బాధపడుతుండడంతో 2023 ఆగస్టులో పోలీసులు అతడిని ఎర్రగడ్డ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స తర్వాత కోలుకోవడంతో అదే ఏడాది నవంబరులో వైద్యులు డిశ్చార్జి చేశారు. కానీ అతడికి నా అనేవారు లేకపోవడంతో డిశ్చార్జి కమిటీ వార్డులోనే ఉంటూ సోమవారం నాటి ఘటనలో మృతి చెందాడు.

**నిజ నిర్ధారణ కమిటీ ఏర్పాటు**

వైద్యశాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, డీఎంఈ డాక్టర్ నరేంద్రకుమార్, డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటి ఆసుపత్రికి వచ్చి.. క్లోజ్డ్ వార్డును, వంట గదిని పరిశీలించారు. ఆహారం కలుషితమైందా అనే కోణంలో ఆరా తీశారు. సంఘటనపై నిజనిర్ధారణ కమిటీని ఏర్పాటు చేస్తున్నామని, నివేదిక రాగానే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని డీఎంఈ తెలిపారు. రోగుల కోసం ప్రత్యేకించి ట్యాంకర్లలో తాగునీటిని తెప్పించి అందిస్తున్నామని కలెక్టర్ చెప్పారు.

# కనుల ముందు కలల కప్పు




(మొదటిపేజీ తరువాయి)

సహా మూడు వికెట్లు 26 పరుగుల వ్యవధిలో కోల్పోయి పంజాబ్ ఓటమి దిశగా సాగింది. అద్భుతంగా బౌలింగ్ చేసిన కృనాల్ రెండు కీలక వికెట్లు పడగొట్టడమే కాకుండా, పరుగుల ప్రవాహాన్ని అడ్డుకుని పంజాబ్‌ను దెబ్బతీశాడు. కృనాల్ బౌలింగ్‌లో ప్రభ్‌సిమ్రన్ ఔట్ కాగా.. షెఫర్డ్ బౌలింగ్‌లో ఓ పేలవ షాట్‌తో శ్రేయస్ (1)నిష్క్రమించాడు. జోరుగా సాగుతున్న ఇంగ్లిస్.. కృనాల్ బౌలింగ్‌లో బౌండరీ వద్ద లివింగ్‌స్టన్ అందుకున్న ఓ చక్కని క్యాచ్‌కు వెనుదిరిగాడు. 14 ఓవర్లలో పంజాబ్ 106/4తో నిలవగా.. ఆర్సీబీ పట్టు బిగించింది. పంజాబ్ సాధించాల్సిన రన్‌రేట్ బాగా పెరిగిపోయింది. ఆఖరి ఆరు ఓవర్లలో 85 పరుగులు చేయాల్సిన పరిస్థితి. శశాంక్ రెండు సిక్స్‌లు, వధేరా ఓ సిక్స్ బాదడంతో పంజాబ్ మళ్లీ పోటీలోకి వచ్చింది. నాలుగు ఓవర్లలో 55 పరుగులు అవసరమయ్యాయి. కానీ భువనేశ్వర్ ఒకే ఓవర్లో (17వ) వధేరా (15), స్టాయినిస్ (6)లను ఇద్దరినీ ఔట్ చేసి పంజాబ్‌ను దెబ్బతీసి, ఆర్సీబీని సంబరాల్లో ముంచెత్తాడు. తర్వాతి ఓవర్లో అద్భుతంగా బౌలింగ్ చేసిన యశ్ దయాళ్ కేవలం 5 పరుగులే ఇచ్చి అజ్మతుల్లాను ఔట్ చేశాడు. ఆఖరి రెండు ఓవర్లలో పంజాబ్ 42 పరుగులు చేయాల్సిన స్థితిలో బెంగళూరు విజయం ఖాయమైపోయింది. కాకపోతే శశాంక్ దూకుడు ఆర్సీబీ ఓటమి అంతరాన్ని తగ్గించింది. ఆఖరి ఓవర్లో హేజిల్‌వుడ్ బౌలింగ్‌లో అతడు వరుసగా 6, 4, 6, 6 బాదేశాడు. కానీ సంబరాలు బెంగళూరివే.

రాణించిన ఆర్సీబీ బ్యాటర్లు: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరుకు ఆరంభంలో షాక్ తగిలింది. టోర్నీలో చక్కని ఆరంభాలనిచ్చిన ధనాధన్ బ్యాటర్ సాల్ట్ (16; 9 బంతుల్లో 2×4, 1×6).. ఈసారి త్వరగానే నిష్క్రమించాడు. టోర్నీలో ఆర్సీబీ టాప్ స్కోరర్ కోహ్లి ఎప్పటిలాగే యాంకర్ పాత్రను పోషించాడు కానీ.. బ్యాట్ ఝళిపించలేకపోయాడు. మయాంక్ (24; 18 బంతుల్లో 2×4, 1×6)తో కలిసి అతడు జట్టుకు మెరుగైన ఆరంభం వచ్చేలా చూశాడు. అయితే కొన్ని చక్కని షాట్లు ఆడిన మయాంక్‌ను ఏడో ఓవర్లో చాహల్ వెనక్కి పంపాడు. అప్పటికి స్కోరు ఆర్సీబీ స్కోరు 56. మయాంక్ స్థానంలో వచ్చిన కెప్టెన్ పాటీదార్ (26; 16 బంతుల్లో 1×4, 2×6) కూడా ధాటిగా ఆడినా.. కోహ్లి మాత్రం జోరందుకోలేదు. సింగిల్స్‌నే కొనసాగిస్తూ అతడికి సహకరించాడు. కానీ ఇది కూడా చిన్న భాగస్వామ్యమే. 7 నుంచి 10 ఓవర్ల మధ్య 32 పరుగులే రాగా.. 11వ ఓవర్లో పాటీదార్‌ను జేమీసన్ ఔట్ చేశాడు. ఆర్సీబీ పరుగుల వేగం తగ్గగా.. కోహ్లి గేర్ మార్చకుండానే 15వ ఓవర్లో నిష్క్రమించాడు. అప్పటి వరకు ఇన్నింగ్స్ పంజాబ్ నియంత్రణలోనే సాగినట్లనిపించింది. కానీ జితేశ్ శర్మ రాకతో ఆట స్వరూపమే మారింది. గతి తప్పిన జేమీసన్ ఓవర్లో జితేశ్ రెండు సిక్స్‌లు, లివింగ్‌స్టన్ (25; 15 బంతుల్లో 2×6) ఓ సిక్స్ బాదేశాడు. లివింగ్‌స్టన్‌ను ఔట్ చేసినా.. ఆ ఓవర్లో జేమీసన్ 23 పరుగులు సమర్పించుకున్నాడు. విధ్వంసకంగా బ్యాటింగ్ చేస్తున్న జితేశ్ (24; 10 బంతుల్లో 2×4, 2×6) క్రీజులో ఉండగా.. 17 ఓవర్లలో 168/5తో ఆర్సీబీ పెద్ద స్కోరు చేసేలా కనిపించింది. కనీసం 200 దాటడం ఖాయమనిపించింది. కానీ వైశాఖ్, అర్ష్‌దీప్‌ల సూపర్ బౌలింగ్‌తో ఆర్సీబీని పంజాబ్ కట్టడి చేసింది.

# పోలవరం.. డబుల్ ఇంజిన్ వేగం!

జగన్ సర్కార్ విధ్వంస ఛాయల నుంచి పోలవరం ప్రాజెక్టు బయటపడింది. ఏడాది క్రితం కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక ఈ ప్రాజెక్టు పనులను మళ్లీ గాడిన పెట్టారు. ప్రజలు డబుల్ ఇంజిన్ సర్కార్‌కు పట్టం కట్టడంతో కేంద్ర ప్రభుత్వమూ చేయూత అందిస్తోంది. అవసరమైన నిధులూ ముందే ఇస్తోంది. 'అసలు ఈ ప్రాజెక్టు ఎప్పుడు పూర్తవుతుందో, ఎప్పుడు పూర్తి చేస్తామో తెలియదు, చెప్పలేం. ఈ ప్రాజెక్టులో అన్ని సమస్యలు ఉన్నాయి' అంటూ నాడు జగన్ సర్కార్‌లో జలవనరుల మంత్రి బహిరంగంగా ప్రకటించి చేతకానితనాన్ని చాటుకున్న స్థాయి నుంచి '2027 డిసెంబరు నాటికి పోలవరం పూర్తి చేస్తాం. ఖరీఫ్ కాలానికి నీళ్లందిస్తాం' అని నమ్మకంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించే స్థాయికి ఈ ప్రాజెక్టు చేరుకోవడం ప్రధానం. ఈ ఏడాది కాలంలో పోలవరం ముఖచిత్రం మారిపోయింది. ప్రధాన డ్యాం నిర్మాణంలోనే కాదు ఎడమ కాలువ పనులూ పరుగులు పెడుతున్నాయి. జగన్ సర్కార్‌లో ఈ కాలువ పనులు ఒక్క శాతం కూడా చేయలేదు. ఐదేళ్ల కాలాన్ని పూర్తిగా వృథా చేసింది. అలాంటిది ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో జులై నాటికి అనకాపల్లి జిల్లా వరకు ఎడమ కాలువలో గోదావరి వరద జలాలు పారించేలా పనులు చేపట్టారు. టెండర్లు పిలిచారు. గుత్తేదారులకు అప్పజెప్పారు. అధికారులు దగ్గరుండి లక్ష్యం చేరుకునేందుకు చెమటోడుస్తున్నారు.

**నాడు అనిశ్చితి..**

జగన్ ప్రభుత్వం ఐదేళ్ల కాల పరిమితి పూర్తయ్యే నాటికి పోలవరం ఒక అనిశ్చితి. విధ్వంసానికి చిరునామా. ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేసి ఆయకట్టుకు నీళ్లందించేందుకు పూర్తి అవకాశం ఉన్న స్థాయి నుంచి అనేక సమస్యలతో ఈ ప్రాజెక్టును విధ్వంసానికి సాక్ష్యంగా మార్చి వేశారు. 2020 వరదల్లో డయాఫ్రం వాల్ ధ్వంసమైంది. అసలు ఆ విషయాన్ని గుర్తించడానికే ఏడాది సమయం పట్టింది. కొత్తది నిర్మించాలా? పాత వాల్ ఎంత మేర దెబ్బతింది? మరమ్మతులు చేయాలా? అనే అంశాలు కూడా జగన్ పాలనలో తేలలేదు. 2020 భారీ వరదల్లో ప్రధాన డ్యాం నిర్మించాల్సిన ప్రాంతంలో పెద్ద పెద్ద అగాధాలు ఏర్పడ్డాయి. అక్కడి భూ భౌతికపరిస్థితులు మారిపోయాయి. అక్కడ డ్యాం ఎలా నిర్మించాలో కూడా అర్థం కాని పరిస్థితులు. వైబ్రో కాంపాక్షన్ పనులు మొదలు పెట్టినా వాటి సమర్థత తేలలేదు. జగన్ హయాంలో నిర్మించిన గైడ్‌బండ్ కుంగిపోయింది. ప్రధాన డ్యాం 1లో చేపట్టిన పనుల నాణ్యతపైనా ప్రశ్నలు మిగిలాయి. ఎగువ, దిగువ కాఫర్ డ్యాంల నుంచి సీపేజీ పెరిగిపోయింది. వరదల సమయంలో ప్రధాన డ్యాంకు వరద సమస్య లేకుండా నిర్మించుకునేందుకు వీలుగానే 2 కాఫర్ డ్యాంలు నిర్మించారు. ఆ సీపేజీ వల్ల ప్రధాన డ్యాం ప్రాంతం అంతా వరద కాలంలో నీటితో నిండిపోతోంది. దీంతో అసలు ప్రధాన డ్యాం నిర్మాణమే సవాల్‌గా మారింది. కేంద్రం నుంచి అవసరమైన నిధులు పూర్తి స్థాయిలో అందలేదు. 45.72 మీటర్ల స్థాయికి నీళ్లు నిలబెట్టేలా డీపీఆర్‌కు కేంద్రం ఆమోదించాల్సి ఉన్నా అది సాధించలేదు. దీంతో జగన్ సర్కార్ తొలిదశలో 41.15 మీటర్లకు నీళ్లు నిలబెట్టేందుకు అయ్యే ఖర్చు ఎంతో లెక్కించి అందుకు అనుమతించాలంటూ

epaper.samayamdaily.net
సమయం
APTEL/2006/18267
మన గొంతుకే.. మన పత్రిక
తెలుగు దినపత్రిక





## ప్రజా సంక్షేమమే ధ్యేయం.. అభివృద్దే తారకమంత్రం..

కుత్బుల్లాపూర్ జూన్ 3 సమయం న్యూస్ :ప్రజా సంక్షేమమే ధ్యేయంగా, అభివృద్దే తారక మంత్రంగా అందరికీ అందుబాటులో ఉండే నాయకులు బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ గారు. ప్రతీ రోజు నియోజకవర్గానికి చెందిన ప్రజాప్రతినిధులు, ప్రజల సమస్యలను సావధానంగా వింటూ సమస్యల పరిష్కార దిశగా అధికారులను ఆదేశించ దంతో పాటు ఆత్మీయ నేతకు మా ఇంటి ఆహ్వానం అంటూ ప్రజలు అందజేసే ఆహ్వానాలను అందుకుంటున్నారు. ఈ క్రమంలో మంగళవారం కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే గారి నివాస కార్యాలయం వద్ద నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులు, సంక్షేమ సంఘాల సభ్యులు, మహిళా నాయకురాలు పలు వినతులు, ఆహ్వానపత్రికలు అంద జేయగా సానుకూలంగా స్పందించారు.



## ఘనంగా హరీష్ రావు జన్మదిన వేడుకలు

గుమ్మడిదల ,జూన్ 3, సమయం న్యూస్ : మండల కేంద్రమైన గుమ్మడిదలలో మాజీ మంత్రి హరీష్ రావు జన్మదిన వేడుకలు మంగళవారం మండల పార్టీ అధ్యక్షుడు కొత్తపల్లి ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర నాయకులు, సిజేఆర్ ట్రస్ట్ చైర్మన్ గోవర్ధన్ రెడ్డి హాజరై కేక్ కట్ చేసి హరీష్ రావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయ కులు మాట్లాడుతూ హరీష్ రావు రాష్ట్రానికి చేసిన సేవలు, ఆయనకు ప్రజల పట్ల ఉన్న నిబద్ధతను కొనియాడారు. ఆరోగ్య రంగం, సాగునీటి ప్రాజెక్టులు, రైతు సంక్షేమం కోసం ఆయన చేసిన కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులునరసింహారెడ్డి, శ్రీనివాసరెడ్డి, రాజశేఖర్, వేణు, మంద భాస్కర్ రెడ్డి, మొగులయ్య, సత్యనారాయణ, చంద్రారెడ్డి, ఆంజనేయులు యాదవ్ ,మల్లేష్ గౌడ్, సత్తయ్య ,గ్రామస్తులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## గోవుల అక్రమ రవాణాన్నిఅరికట్టండి బీ జే పి నాయకులు

నర్సాపూర్ మే 3, (సమయం న్యూస్):బక్రీద్ పండగ సందర్భంగా నర్సాపూర్ పట్టణ మరియు పరిసర ప్రాంతాల నుంచి అక్రమంగా గోవులను తరలించకుండా నర్సాపూర్ పట్టణ సమీపంలోచెక్ పోస్ట్ లను ఏర్పాటు చేయాలనిహిందువుల ఆరాధ్య దైవంగా భావించే గోమాతలను హత్యకు గురికాకుండా, గో సంరక్షణ చట్టం కింద ఎవరైనా అక్రమంగా గోవులను రవాణా చేస్తే వారిపైన కఠిన చర్యలు తీసుకోవాలనినర్సాపూర్ సిఐ కి బిజెపి మరియు యువమోర్చా నాయకులు వినతి పత్రం ఇవ్వటం జరిగింది.ఈ కార్యక్రమంలోరాష్ట్ర ఓబీసీ ఉపాధ్యక్షులు పాపగారి రమేష్ గౌడ్, బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు బాలరాజ్, నర్సాపూర్ మండల అధ్యక్షుడు నాగేష్, నర్సాపూర్ బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి,బీజేవైఎం రాష్ట్ర నాయకులుఅర్విందే వాల్దాస్ ,బీజేవైఎం నర్సాపూర్ పట్టణ అధ్యక్షులు ప్రేమ్ కుమార్ యాదవ్, నర్సాపూర్ బిజెపి మండల ప్రధాన కార్యదర్శి బాలు, నారాయణపూర్ బూత్ అధ్యక్షులు దుర్గ ప్రసాద్, బీజేవైఎం నాయకులు మహేందర్ గౌడ్, పవన్,రాజు, సాయి,మధు, శ్రవణ్ పృధ్వీరాజ్, వేణు, అనిల్, కిరణ్, వినయ్, రాజు, యాదగిరి, గణేష్, శివ, పవన్, కిషోర్, పూర్ణ, శ్యామ్, ప్రశాంత్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు..

# భూ సమస్యను భూ భారతి రెవెన్యూ సదస్సులలో దరఖాస్తు చేసుకోవాలి

**: జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు**



సంగారెడ్డి మే03(సమయం న్యూస్) : నూతన రెవెన్యూ చట్టం భూభారతి అమలులో భాగంగా నేటి నుంచి జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ సదస్సులు నిర్వ హించనున్నట్లుజిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరుతెలిపారు. అందులో భాగంగా సంగారెడ్డి మండలం ఇస్మాయిల్ ఖాన్ పేట గ్రామంలో నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సులో టీజీఐసి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి తో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడుతూ రైతులు ఏ చిన్న, భూ సమస్యనైనా రెవెన్యూ సదస్సులో దరఖాస్తు చేసుకోవాలన్నారు.భూ భారతి చట్టం ఏప్రిల్ 14న సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించాడం జరిగిందన్నారు.నేటి నుంచి 20 వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా మిగిలిన అన్ని మండలాల్లో" ప్రజల వద్దకే రెవెన్యూ నినాదం'తో సదస్సులు నిర్వహిస్తాం అని, అన్ని రెవెన్యూ గ్రామాలకు తహసీల్దార్ కూడిన బృందం వెళ్లిప్రజల నుంచి భూ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించి, పరిష్కరిస్తుందన్నారు. వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడుఆన్లైన్లో నమోదు చేయడంతో పాటు సమస్యలు పరిష్కరిస్తారన్నారు. అన్ని రకాల భూ సమస్యలను పరిష్కరించాలన్నారు. భూ సమస్యలను అధికారులు మానవీయ కోణంలో పరిష్కరించాని ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.టీజీ ఐ ఐ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ భూ భారతి చట్టం రైతుల చుట్టం అని ,గతంలో ధరణి తో రైతులు ఇబ్బంది పడ్డారని ,కార్యాలయాల చుట్టూ,కోర్టు ల చుట్టూ తిరిగరన్నారు. ముఖ్య మంత్రి మాట ప్రకారం అధికారులే ప్రజల వద్దకు వస్తున్నారనిఅన్నారు. వ్యక్తికి ఆధార్ భూమికి భూదార్ కూడా ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే అన్ని హామీలు అన్ని నెరవేరుస్తున్నారని, 6 గ్యారంటీల అమాలు తప్పకుండా చేస్తామన్నారు.ఇందిరమ్మ రాజ్యంలో ప్రజలు సుభిక్షంగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ రవీందర్ రెడ్డి, మండల ప్రత్యేక అధికారి ఖాసిం బేగ్, రెవెన్యూ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# భూభారతి రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

*** కలెక్టర్ విజయేందిర బోయి**



మహబూబ్ నగర్, జూన్ 03( సమయం న్యూస్) : భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భూభారతి చట్టం అమలులో భాగంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ విజయేందిర బోయి సూచించారు.బాలానగర్మండలం కేతిరెడ్డి పల్లి, రాజాపూర్మండలం రంగా రెడ్డి గూడ గ్రామాలలో మంగళవారం నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సులలో కలెక్టర్ పాల్గొన్నారు. రైతులతో ముఖాముఖి మాట్లాడి, వారి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. భూ భారతి చట్టంలోని అంశాలను వివరిస్తూ, రైతుల సందేహాలను నివృత్తి చేశారు. భూ సమస్యలు పరిష్కరించి, రైతులకు వారి భూములపై పూర్తి హక్కులు కల్పించేందుకే ప్రభుత్వం భూభారతి చట్టం అమలు చేస్తోందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇప్పటికే మూసాపేట మండలంలో పైలెట్ ప్రాతిపదికన రెవెన్యూ సదస్సులు జరిపి, క్షేత్రస్థాయి పరిశీలన పూర్తి చేశామని అన్నారు. ప్రస్తుతం జిల్లాలోనిమండలాలు,రెవెన్యూ గ్రామాలలో ఈ నెల 20వ తేదీ వరకు సదస్సులు నిర్వహించేలా ప్రణాళిక రూపొందించామని తెలిపారు. తహసీల్దార్, నాయబ్ తహసీల్దార్ల నేతృత్వంలో రెండు బృందాలను నెలకొల్పి, ప్రతి రోజు ప్రతి మండలంలో రెండు గ్రామాలలో రెవెన్యూ సదస్సులు జరిపేలా చర్యలు తీసుకున్నామని కలెక్టర్ తెలిపారు. భూ రికార్డులలో పేరు తప్పులు, విస్తీర్ణం హెచ్చు తగ్గులు, వారసత్వ భూములు, భూ స్వభావం తప్పులు, నిషేధిత జాబితాలో ఉన్న భూ సమస్యలు, సర్వే నెంబర్ మిస్సింగ్, పట్టా పాస్ బుక్కులు లేకపోవడం, ప్రభుత్వ భూములను నవీకరించడం, సాదాబైనామా కేసులు, హద్దుల నిర్ధారణ, పార్ట్‌బి లో చేర్చిన భూముల సమస్యలు, భూసేకరణ కేసులు తదితర భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు సదస్సులలో స్వీకరించి భూభారతి కొత్త చట్టం ప్రకారం అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, నిర్దేశిత గడువు లోపు సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. నిర్ణీత షెడ్యూల్ ను అనుసరిస్తూ ఆయా గ్రామాలలో అధికారులు ఉదయం నుండి సాయంత్రం వరకు అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు. రెవెన్యూ సదస్సుల్లో ప్రభుత్వపరంగా నిర్ణీత ప్రొఫార్మాలో ప్రింట్ చేసిన దరఖాస్తులను అందజేయడం జరుగుతుందని అన్నారు. దరఖాస్తుల స్వీకరణ పూర్తయిన అనంతరం క్షేత్రస్థాయి పరిశీలన, విచారణ కోసం వచ్చే రెవెన్యూ బృందాలకు సహకరించాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగారిజిస్ట్రేషన్ ప్రక్రియ, హెల్ప్ డెస్క్, జనరల్ డెస్క్ ల వద్ద సదుపాయాలు, సిబ్బంది పనితీరును కలెక్టర్ పరిశీలన జరిపి, అధికారులకు పలు సూచనలు చేశారు. అర్జీలు సమర్పించేందుకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. భూ సంబంధిత సమస్యలు ఉన్న వారు నిర్ణీత ప్రొఫార్మా లో సరైన విధంగా దరఖాస్తు చేసుకునేలా సహకారం అందించాలని హెల్ప్ డెస్క్ సిబ్బందిని ఆదేశించారు. కలెక్టర్ వెంట తహశీల్దార్ లు,రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు

# క్రీడాకారులకు స్వీయ క్రమశిక్షణ ఎంతో అవసరం

*** శిల్ప హోమ్స్ చైర్మన్ పి. శ్రీనివాస్ రెడ్డి**

హైదరాబాద్,క్రీడా ప్రతినిధి :బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్న.. కలలుగన్న కెరియర్స్ సౌధాన్ని పటిష్టంగా నిర్మించుకోవాలన్న స్వీయ క్రమశిక్షణ ఎంతో అవసరమని శిల్ప హోమ్స్ చైర్మన్ పి. శ్రీనివాస్ రెడ్డి అన్నారు. కొండాపూర్ లోని ఏ జోన్ బ్యాట్మింటన్అకాడమీలో నిర్వహించిన వికారాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ నిర్వహించిన జిల్లా టోర్నమెంట్ మంగళవారం ముగిసింది. ఈ టోర్నమెంట్ బి ఏ వి డి జిల్లా అధ్యక్షుడు కొసరాజు లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి యు వి ఎన్ బాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు.ఈ మేరకు వివిధ విభాగాల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులతో పాటు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పి. శ్రీనివాస్ రెడ్డి తో పాటు బ్యాట్ కోశాధికారి వంశీధర్, ఆర్ ఆర్ డి బి ఏ ఆనంద్, బి ఏ వి డి జాయింట్ సెక్రెటరీ సుభాష్ రెడ్డి, బి ఏ వీ డి కోశాధికారి పివిఎల్. కుమార్, బీఏవీడి మెంబర్ ఏ. వి రమణారెడ్డి, మ్యాచ్ పాయింట్ బ్యాట్మెంటన్ అకాడమీ నిర్వాహకులు వేణు చౌదరి, ఇంటర్నేషనల్ క్రీడాకారిని మనీషా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వికారాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి యూవియన్ బాబు మాట్లాడుతూ కొత్తగా ఏర్పాటు చేసిన వికారాబాద్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మొదటి టోర్నమెంట్ కు 265 మంది క్రీడాకారులు పాల్గొనడం సంతోషకరంగా ఉందని, జిల్లా వ్యాప్తంగా మరెన్నో టోర్నమెంట్లు నిర్వహిస్తామని తెలిపారు.జిల్లా వ్యాప్తంగా క్రీడాకారుల నైపుణ్యాన్ని గుర్తించి వారిని ప్రోత్సహిస్తామని తెలిపారు.టోర్నమెంట్ కుసహకరించిన ఏ జోన్ బ్యాట్మింటన్ అకాడమి మేనేజ్మెంట్ మరియు వారి సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.




# కేబీఆర్ పార్కు లో చేపట్టిన పనులను పరిశీలించిన కమీషనర్ ఆర్.వి కర్ణన్





హైదరాబాద్, జూన్ 03( సమయం న్యూస్) వాకర్స్ సౌకర్యం కోసం ఏర్పాటు చేసిన పనులను వినూత్నంగా చేపట్టి పూర్తిచేయాలని జీహెచ్ఎంసీ కమీషనర్ ఆర్. వి.కర్ణన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన కేబీఆర్ పార్కులో చేపట్టిన పనులను పరిశీలించారు. లైసెన్స్ తీసుకున్న పెట్ డాగ్స్ ను మాత్రమే పార్కులోకి తీసుకురావాలని కమీషనర్ ఆదేశించారు. కేబీఆర్ చుట్టూ హెచ్ సిటీ ద్వారా చేపట్టే ఫ్లైఓవర్లు, అండర్ పాసులు కోర్టు ఆదేశాల మేరకు నిర్మిస్తున్నారా అంటూప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులను వివరణ కోరగా, సెన్సిటివ్ జోన్ పరిధిలోనే పనులు చేపట్టినట్లు ప్రాజెక్టు ఇంజనీర్లు కమీషనర్ కు వివరించారు. కమీషనర్ వెంట అడిషనల్ కమిషనర్ సుభద్ర దేవి, డిసి సమ్మయ్య, ప్రాజెక్టు , ఎస్.ఈ శ్రీ లక్ష్మీ, ఈఈ నాయక్డిప్యూటీ ఈఈ హరీష్, సర్కిల్ ఈఈ విజయ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రతి గ్రామానికి నాణ్యమైన విత్తనం

వెల్దుర్తి జూన్ 3, సమయం న్యూస్ : ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంమరియు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో"ప్రతి గ్రామానికి నాణ్యమైన విత్తనం" కార్యక్రమం వెల్దుర్తి గ్రామం, మెదక్ జిల్లాలో నిర్వహించడంజరిగింది. ఈ కార్యక్రమంలో రైతులకు ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయంలో తయారు చేసిన నాణ్యమైన వరి మరియు పెసర విత్తనాలను ఇవ్వడం జరిగింది. అదే విధంగా విత్తనాన్ని తీసుకున్న రైతులు వారి పొలంలో విత్తనాన్ని స్వయంగా ఉత్పతి చేసి ఇతర రైతులకు మరియుభావితరాలకు అందించాలనిప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్త Dr. B. లక్ష్మీ ప్రసన్న, ఏవో. ఝాన్సీ, ఏ ఈ ఓ లుమజీద్ అలీ, వందన, ఉత్తమ్ కుమార్, సాయి కిరణ్, రేవతి మరియు రైతులు మరియు మహిళా రైతులు పాల్గొని కిట్లుతీసుకొనివారి సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

# సుముహూర్తంలో ప్రారంభమైన శ్రీ గురు పీఠం లో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాలు!





శివంపేట్ జూన్ 3 (సమయం న్యూస్) : శివంపేట మండల కేంద్రంలోని గూడూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ గురు పీఠంలో దేవత మూర్తుల విగ్రహాల ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమం మూడు రోజుల లోభాగంగా మొదటి రోజుశ్రీ గురు పీఠం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పెద్దగుని జిన్నారం శివకుమార్ గౌడ్ రమాదేవి దంపతులట్రస్ట్ సభ్యుల ఆధ్వర్యంలో 25 వేద పండితుల మధ్య గోపూజతో కార్యక్రమం ప్రారంభించారు. శ్రీ దత్తాత్రేయ సాయిబాబ దేవాలయ ప్రదక్షణ, యాగశాల ప్రదక్షిణ, ప్రవేశ భారీ, విఘ్నేశ్వర పూజ, పుణ్యావాచనము, మర్జనాలు, పంచ గవ్య స్థాపన, మార్జన, దీక్షాధారణ, అఖండ స్థాపన, గురు మంట పారాధన, నీరాజన మంత్రపుష్పములు, వేద స్వస్తి , అంకురారోపణ, అగ్ని ప్రతిష్టాపన, మాదనగ్ని, మూర్తి హొమ, ధ్వజారోహణ, బేరి పూజ, చురునికా పట్టణములు, యాగశాల బలిహరణ, నిరాజన మంత్రపుష్పములు. వేద పండితుల మధ్య మొదటి రోజు పూజకార్యక్రమాలు నిర్వహించారు. శ్రీ గురు పీఠం చారిటబుల్ ట్రస్ట్ సభ్యుల సహకారంతో శ్రీ దత్తాత్రేయ స్వామి, మరియు శ్రీ సాయి బాబ దేవాలయమునకు వచ్చిన భక్తులకు శ్రీ గురు పీఠం చారిటబుల్ ట్రస్ట్ సభ్యుల సహకారంతో దర్శనమునకు వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ ప్రతిష్ట ఉత్సవాలు కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, మాజీ జెడ్పిటిసిపబ్బా మహేష్ గుప్తా, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొడకంచి సుదర్శన్ గౌడ్, టిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడురాజా రమణ గౌడ్, స్థానిక మాజీ సర్పంచ్ గురు పీఠం ట్రస్ట్ సభ్యులు జిన్నారం పెద్ద గోనిస్వరాజ్యలక్ష్మి శ్రీనివాస్ గౌడ్ దంపతులు ట్రస్టు సభ్యులు రాజ్యం బిక్షపతి యాదవ్, నోముల హనుమంతు తదితరులు ఉన్నారు. తొలిరోజు విగ్రహ ప్రతిష్టఉత్సవాలకు వివిధ గ్రామాల నుంచిఅలాగే గూడూరు, శివంపేట గ్రామాల నుంచి సాధారణ భక్తులు సైతం పెద్ద సంఖ్యలో గురు పీఠానికి చేరుకొని అక్కడ జరుగుతున్న పూజా కత్రువులను, యాగాలను చూసి తన్మయత్వం పొందారు. భక్తులకు యాజమాన్యం శ్రీ గురు పీఠం చారిటబుల్ ఫౌండర్ ట్రస్ట్ చైర్మన్ జిన్నారం పెద్దగౌని శివ కుమార్ గౌడ్ రమాదేవి దంపతుల పర్యవేక్షణలో వేద పండితులకు, సాధారణ భక్త జనాలకు వేర్వేరుగా అన్నదానం చేశారు.



## ఇందిరమ్మ నమూనా గృహాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే , ఎమ్మెల్సీ

జిన్నారం, జూన్ 3, సమయం న్యూస్ : మండల కేంద్రమైన జిన్నారంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్మించదలచిన ఇందిరమ్మ నమూనా గృహాన్ని స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ,స్థానిక ఎమ్మెల్సీ అంజిరెడ్డి లు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నూతనంగా షేర్ వాల్ టెక్నాలజీ తో నిర్మించిన ఇందిరమ్మ నమూనా గృహం ఎంతో అద్భుతంగా ఉందని, దీంతో పేదవాడి సొంతింటి కళ నెరవేరుతుందని వారు పేర్కొన్నారు. త్వరలోనే మండలంలో నిర్మించబోయే ఇందిరమ్మ గృహాలకు ఈ నమూనా బాగుంటుందని వారు అభిప్రాయపడ్డారు. ఈ ఇంటి నిర్మాణం వేదాన్ ఇన్ ఫ్రా ప్రాజెక్ట్ ప్రైవేట్ లిమిటెడ్ వారు చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అరుణ రెడ్డి, గృహ నిర్మాణ సంస్థ ఏఈ సుజల, వేదాన్ ఇన్ ఫ్రా సీఈవో మల్లికార్జున్, మాజీ జెడ్పివైస్ చైర్మన్ కుంచాల ప్రభాకర్, జిన్నారం మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్, నాయకులు శ్రీకాంత్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, వడ్డే కృష్ణ,జగన్ రెడ్డి, అధికారులు, వివిధ గ్రామాల నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ చేపట్టండి

**: స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్.**



నిర్మల్ జూన్03 (సమయం న్యూస్) : వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్‌లు నిర్వహించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలోసంబంధిత శాఖల అధికారులతో ఆయన చర్చించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజారోగ్య పరిరక్షణలో నిమగ్నమైన ప్రతి శాఖ సమన్వయంతో పని చేయాలని, బాధ్యతల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని ఉపేక్షించేది లేదన్నారు. మలేరియా, డెంగ్యూ వంటి సీజనల్ వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా ప్రాధాన్యత గల ప్రాంతాల్లో డ్రెయిన్‌లు పూర్తిగా శుభ్రపరచాలని, నీటి నిల్వలు ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. శానిటేషన్ కార్యక్రమాల్లో పాల్గొనే కార్మికులకు కనీస వేతనం చెల్లించాలని, పని ప్రమాణానికి అనుగుణంగా సౌకర్యాలు కల్పించాలని సూచించారు. మలేరియా దోమల నియంత్రణకు ఆయిల్ బాల్స్ స్ప్రే చేయాలనీ ఆదేశించారు.గ్రామ, వార్డు వలంటీర్లు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంల ద్వారా ప్రజల్లో శుభ్రతపై అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. రానున్న వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అలాగే పాఠశాలలు, హాస్టళ్లు, అంగన్‌వాడీ కేంద్రాల పునః ప్రారంభానికి అవసరమైన ఏర్పాట్లు, బడి బాట కార్యక్రమం, చిన్న మరమ్మత్తులు, యూనిఫాం కుట్టింపు, పాఠ్యపుస్తకాల పంపిణీ వంటి అంశాలపై మండలాల వారీగా చర్చించారు.వనమహోత్సవంలో భాగంగా మొక్కల నాటేందుకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులకు అదనపు కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. ఈసమావేశంలో జడ్పీ సిఈఓ గోవింద్, పి డి డి ఆర్ డి ఓ విజయలక్ష్మి, డి పి ఓ శ్రీనివాస్, డి ఈ ఓ రామారావు, సంక్షేమ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## కలెక్టర్ గారు మా గోడు ఆలకించండి

- **చట్ట ప్రకారం నష్టపరిహారం ఇవ్వాలని కోరిన గుమ్మడిదల రైతులు**
- **హరీష్ రావు సూచన మేరకు గోవర్ధన్ రెడ్డి నేతృత్వంలో కలెక్టర్ ను కలిసిన బాధిత రైతులు**

గుమ్మడిదల , జూన్ 3 , సమయం న్యూస్ :సంగారెడ్డి జిల్లా మండల కేంద్రమైన గుమ్మడిదల రైతులు సర్వే నంబర్ 109 లోని భూముల విషయంలో న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి ని మంగళవారం కలిశారు.ప్రభుత్వం గుమ్మడిదల లోని సర్వే నంబర్ 109 లో ఉన్న అసైన్డ్ భూములను ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు కేటాయించడంతో, రైతులు తమ ఆధారాన్ని కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. చట్ట ప్రకారం ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం ఇవ్వాలని వారు కోరారు. రైతుల వినతులు గమనించిన కలెక్టర్ వల్లూరి క్రాంతి ,ఆర్డిఓ రవీందర్ రెడ్డి వారి సమస్యను పరిశీలించి తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్టు బాధిత రైతులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు కొత్తపల్లి ప్రభాకర్ రెడ్డి ,మంద భాస్కర్ రెడ్డి, సూర్యనారాయణ, ఆంజనేయులు యాదవ్, చంద్రారెడ్డి, రైతులు నారాయణ యాదవ్, మోహన్ ,మల్లేష్, బీరప్ప, బాషయ్య ,రవీందర్ ,కిషన్, సత్యనారాయణ, పెంటయ్య, తదితరులు పాల్గొన్నారు.

## మెదక్ జిల్లాలో భూ భారతి రెవెన్యూ సదస్సులు షురూ

- **జూన్ 03 నుండి 20 వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహణ**
- **రైతుల నుండి విశేష స్పందన**
- **టేక్మాల్ మండలం, షాబాద్ తాండగ్రామంలో జరుగుతున్న భూ భారతిరెవెన్యూ సదస్సును పరిశీలించిన కలెక్టర్**
- **31 రెవెన్యూ గ్రామాలలో రెవెన్యూ సదస్సులు *నిర్వహించగా 1150 దరఖాస్తులు స్వీకరణ**
- **మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**




మెదక్ జూన్ 03(సమయం న్యూస్) : భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులు ఆధారంగా రెవెన్యూ సిబ్బంది అవసరమైన చోట క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించిభూ సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. మంగళవారం టేక్మాల్ మండలం, షాబాద్ తాండగ్రామంలో జరుగుతున్న భూ భారతిరెవెన్యూ సదస్సును ఆకస్మిక తనిఖీ చేసి ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన భూ భారతి చట్టంపై ఏప్రిల్ మాసంలో అన్ని మండలాల్లో అవగాహన సదస్సులు నిర్వహించామని తెలిపారు. అనంతరం చిలిపిచేడ్ మండలాన్ని పైలెట్ ప్రాజెక్టు గా ఎంపిక చేసి అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి ప్రజల నుండి విజ్ఞాపనలు, సలహాలు, సూచనలు తీసుకున్నట్లు తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహణకు నిర్దేశించిన షెడ్యూలు ప్రకారం ఈ నెల 3వ తేదీ 20వ తేది వరకు జిల్లాలోని అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈరోజు జిల్లా వ్యాప్తంగా 31రెవెన్యూ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరిగిందని ఇందులో 1150 దాఖస్తులు రావడం జరిగిందని తెలిపారు. ప్రజలు ఇచ్చిన ప్రతి దరఖాస్తు రిజిస్టర్ లో నమోదు చేయాలని ఆదేశించారు. వచ్చిన దరఖాస్తు పరిశీలించి క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించి తదుపరి సమస్యల పరిష్కారానికి నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకుంటామన్నారు . ప్రజలు రెవెన్యూ సదస్సులలో తమ భూ సమస్యలపై దరఖాస్తు ఇవ్వాలని సూచించారు. ఈ సందర్భంగాసదస్సుకు వచ్చినప్రజల భూములకు సంబంధించిన సమస్యలను కలెక్టర్ స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు




## చోరీ లపై ఫోకస్ పెట్టండి

- **వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్**

హనుమకొండ జూన్ 03(సమయం న్యూస్) :పోలీస్ స్టేషన్ల పరిధిలోచోరీల నియంత్రణపై ప్రతి పోలీస్ అధికారి నజర్ పెట్టాలని వరంగల్కమిషనర్ అధికారులకు పిలుపు నిచ్చారు. వరంగల్ పోలీస్ కమిషనర్ ఆధ్వర్యంలో నెలవారి నేర సమీక్షా సమావేశాన్ని పోలీస్ కమిషనరేట్ కార్యాలయములో నిర్వహించారు. వరంగల్ కమిషనరేట్ చెందిన పోలీస్ అధికారులు పాల్గోన్న ఈ సమీక్షా సమావేశంలో పోలీస్ కమిషనర్ ముందుగాఆస్తి నేరాలపై సమీక్షా జరిపారు. ఇందులో ప్రధానంగా పెండింగ్ చోరీ కేసుల్లో నిందితుల అరెస్ట్, సోమ్ము రికవరీ, పెండింగ్ లో వున్న చోరీ కేసులు, నిందితుల అరెస్ట్ పై సీపీ సమీక్ష జరపడం తో పాటు, సుధీర్ఘ కాలంగా పెండింగ్‌లో వున్న ఇతర కేసులపై సమీక్ష జరిపడంతో పాటు పెండింగ్‌కు గల కారణాలను పోలీస్ కమిషనర్ సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులను అడిగి తెలుసుకోని, కేసుల పరిష్కారం కోసంతీసుకోవాల్సిన చర్యలను పోలీస్ కమిషనర్ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో నేరాల నియంత్రణకై సిసి కెమెరాల ఏర్పాటుకు ప్రజలను భాగస్వాములను చేయడంతో సిసి కెమెరాల ప్రాధాన్యతపై ప్రజలకు అవగహన కల్పించాలని. నేరాలకు సంబంధించి అధికారులు దర్యాప్తు సమయం లో టెక్నాలజీ తో పాటు శాస్త్రీయ పద్ధతిలో దర్యాప్తు చేపట్టాలని, చోరీలపై పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రజలకు అవగాహన కల్పించాలని ముఖ్యంగా వాహనాల చోరీలకు సంబంధించి వాహనాలను ఇంటిలో పార్కింగ్ చేసుకోనే విధంగా ప్రజలకు సూచించాలని సీపీ తెలియజేసారు. రాబోవు బక్రీద్ పండుగను దృష్టి లో పెట్టుకొని మూగజీవాల రవాణా పై ప్రత్యేక దృష్టి పెట్టడం పాటు, పండుగ వేళ దర్గాల వద్ద పతిష్టమైన పోలీస్ బందోబస్త్ఏర్పాటు చేయాలని.వరంగల్ కు వున్న కీర్తి ప్రతిష్టలకు తగ్గట్లుగా పోలీసింగ్ వుండాలి. ప్రతి పోలీస్ బేసిక్ పోలీసింగ్ పై దృష్టి పెట్టాలని పోలీస్ కమిషనర్ అధికారులకు ఆదేశించారు. ఈ సమావేశంలో డీసీపీలు షేక్ సలీమా , రాజమహేంద్ర నాయక్, అంకిత్‌కుమార్, జనగాం ఏఎస్పీ చైతన్య, అదనపు డిసిపిలు రవి, సురేష్‌కుమార్‌తో పాటు ఏసిపిలు, ఇన్స్‌స్పెక్టర్లు, ఎస్.ఐలు పాల్గోన్నారు.



వీరఘట్టం పట్టణ వ్యవసాయ మార్కెట్ యార్డ్ నందు వ్యవసాయ పనిముట్లు పంపిణీ కార్యక్రమంలోపాల్గొన్నారు పాలకొండ నియోజకవర్గ శాసనసభ్యులు నిమ్మక జయక్రిష్ణపాల్గొన్నారు.

- వీరఘట్టం, జూన్ 3, సమయం న్యూస్

# పేదల ఆరోగ్య భద్రత కోసం కాంగ్రెస్ కృషి

**: సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ***

బోధన్ పట్టణం, జూన్ 3, సమయం న్యూస్ :మాజీ మంత్రి స్థానిక నియోజకవర్గ శాసనసభ్యులు పొద్దుటూరీ సుదర్శన్ రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం బోధన్‌లో సీఎం రిలీఫ్ ఫండ్ (CMRF) నుంచి మంజూరైన చెక్కులను కాంగ్రెస్ నాయకులు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్న పది మంది పేద లబ్ధిదారులకు ఈ ఆర్థిక సహాయం అందజేశారు. వివిధ రకాల వ్యాధుల సమస్యలతో బాధపడుతున్న లబ్ధిదారులు ఈ చెక్కులను స్వీకరించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ పేదల ఆరోగ్య రక్షణ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. అవసరమైన సమయంలో సహాయంగా ఉండటం





తమ కర్తవ్యంగా భావిస్తున్నామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్ ద్వారా ఎంతోమందికి ప్రాణాధారం కలుగుతోందని వారు చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు పాషా మొయినుద్దీన్, ప్రముఖ నాయకులు తూము శరత్ రెడ్డి, హరికాంత్ చారి, అంకు దాము, చిత్రాల ప్రమోద్ కుమార్ (చిన్న) పాల్గొన్నారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రతి అర్హుడికి చేరవేసేందుకు చర్యలు కొనసాగుతాయన్నారు.

## ఏటీఎం చోరీకి యత్నించిన దొంగ అరెస్ట్

జిన్నారం, జూన్ 3, సమయం న్యూస్ ; హెచ్ డి ఎఫ్ సి ఏటీఎంలో చోరీకి యత్నించిన దొంగను అరెస్టు చేసిన ఘటన బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది .బొల్లారం సిఐ రవీందర్ రెడ్డి కథనం ప్రకారం ,సంగారెడ్డి జిల్లా బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని బీరప్ప బస్తీలో నివాసం ఉంటున్న మాలి గణేష్ తండ్రి రమేష్ మహారాష్ట్ర నుండి వలస వచ్చిన నిందితుడు బీరప్ప బస్తిలో గల గల హెచ్ డి ఎఫ్ సి ఏటీఎంలో చోరీకి మంగళవారం తెల్లవారుజామున సుమారు మూడు గంటల ప్రాంతంలో గడ్డపారస్క్రూ డ్రైవర్ సహాయంతో ఏటీఎం ను ధ్వంసం చేసి డబ్బుల దొంగతనానికి ప్రయత్నించాడు. ఈ సమయంలో ఏటీఎం అల్లారం మోగగా, నిందితులు పారిపోయాడు.




వెంటనే స్పందించిన పోలీసులు అక్కడ ఉన్న సీసీ కెమెరాలు ఆధారంగా నిందితున్ని పట్టుకుని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించడం జరిగింది. నిందితునికి నేరచరిత్ర కలదని గతంలో కూడా బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగతనం కేసు ఉన్నదని సీఐ రవీందర్ రెడ్డి తెలిపారు.

### "తెలంగాణ నేతన్నకు భరోసా"

## పథకం మార్గదర్శకాలు విడుదల చేసిన ప్రభుత్వం

- **బడ్జెట్ లో 48.00 కోట్లు కేటాయించిన ప్రభుత్వం - మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు..**
- **సంవత్సరానికి రెండు విడతలుగా నేత మరియు అనుబంధ కార్మికులకు అందనున్న వేతన ప్రోత్సాహకం - మంత్రి తుమ్మల**
- **40,000 మంది చేనేత మరియు అనుబంధ కార్మికులు లబ్ధి - మంత్రి తుమ్మల**
- **తెలంగాణ చేనేత వస్త్రాలకు ప్రత్యేక లేబుల్ - మంత్రి తుమ్మల**

హైదరాబాద్ జూన్ 03( సమయం న్యూస్) : నేత కార్మికుల సంక్షేమానికి ఈ ప్రభుత్వం కట్టుబడి ఉందని, అందులో భాగంగా నే గౌరవ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు ప్రకటించిన తెలంగాణ చేనేత అభయహస్తంలో భాగంగా



తెలంగాణ నేతన్నకు భరోసా పథకానికి సంబంధించిన మార్గదర్శకాలను ఈ నెల 2న జారీ చేయడం జరిగిందని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. ఇందుకోసం బడ్జెట్ రూ. 48.00 కోట్లు కేటాయించినట్లు మంత్రిగారు తెలిపారు. ఈ పథకం ద్వారాజియో ట్యాగ్ చేయబడిన మగ్గాలపై పనిచేస్తున్న కార్మికులకు మరియు అనుబంధ కార్మికులకు వేతన ప్రోత్సాహకం కింద గరిష్ఠంగా సంవత్సరానికి నేత కార్మికులకు రూ. 18,000 మరియు అనుబంధ కార్మికులకు రూ. 6,000 అందించడం జరుగుతుందన్నారు. దీంతో దాదాపు 40,000 మంది చేనేత మరియు అనుబంధ కార్మికులు లబ్ధి పొందుతారని మంత్రిగారు ఆశాభావం వ్యక్తం చేశారు. అంతేకాకుండా చేనేత కార్మికులు తయారుచేసిన వస్త్రాలకు ప్రత్యేకంగా తయారుచేయబడిన యూనిక్ లోగోను జతచేయడం జరుగుతుందని, తద్వారా చేనేత ఉత్పత్తుల నాణ్యత ప్రమాణాలను మరియు నేత కార్మికుని వివరాలను వినియోగదారులు తెలుసుకోవచ్చు. దీంతో తెలంగాణ చేనేత ఉత్పత్తులకు దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో డిమాండ్ పెరిగే అవకాశాలు ఏర్పడతాయని మంత్రిగారు తెలియజేశారు. ఈ పథకం నేత మరియు అనుబంధ కార్మికులందరికీ వర్తిస్తుంది. 18 సంవత్సరాలు నిండి జియో ట్యాగ్ చేయబడిన మరమగ్గాలపై పనిచేసే కార్మికులు మరియు ప్రీలూమ్, ప్రిపరేటరి పనులైనడైయింగ్, టైయింగ్, డిజైనింగ్, వార్పింగ్, వైండింగ్, సైజింగ్ మొదలైన అనుబంధ పనులు చేసే కార్మికులు, చేనేత వృత్తి ద్వారా వారి వార్షిక ఆదాయంలో కనీసం 50 శాతం పొందుతున్నవారు అర్హులు.ఈ పథకం కింద జియో ట్యాగ్ చేయబడిన మగ్గాల ద్వారా వార్పులలో కనీసం 50 శాతం కంటే ఎక్కువ పూర్తి చేసిన నేత మరియు అనుబంధ కార్మికులకు నేరుగా లబ్ధిదారుని బ్యాంకు ఖాతాలోకి వేతన ప్రోత్సాహకం కింద సంవత్సరానికి రెండు విడతలుగా (ఏప్రిల్ నుండి సెప్టెంబర్ మరియు అక్టోబర్ నుండి మార్చి) నేత కార్మికునికి రూ. 9,000, అనుబంధ కార్మికునికి రూ. 3,000 జమ చేయడం జరుగుతుంది. అయితే మొదటి విడతలో 50 శాతం వార్పులు పూర్తి చేయని వారు, రెండో విడతలో పూర్తి చేసినట్లైతే మొత్తం ప్రోత్సాహకం సంవత్సరాంతంలో చేనేత మరియు అనుబంధ కార్మికులకు అందించబడుతుందని మంత్రిగారు తెలిపారు.




## రైతులు ఏ చిన్న భూ సమస్యనైనారెవెన్యూ సదస్సులో దరఖాస్తు చేసుకోవాలి

వెల్దుర్తి జూన్ 03 (సమయం న్యూస్): తెలంగాణ కాంగ్రెస్ సర్కార్ భూ భారతిచట్టాన్ని రూపొందించిందని ఆర్డీవో జయచంద్ర రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మంగళవారం రెవెన్యూ అధి కారులతో కలసివెల్దుర్తి మండలంలోని పెద్దాపురం మరియు ధర్మారం గ్రామంలో ఏర్పాటు చేసినటువంటిరెవెన్యూ సదస్సు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.రైతులు ఏ చిన్న భూ సమస్యనైనారెవెన్యూ సదస్సులో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ రెవెన్యూ సదస్సులోపెద్దాపురం గ్రామంలో 16 దరఖాస్తులు ధర్మారం గ్రామంలో 26 దరఖాస్తులు స్వీకరించామనితహసిల్దార్ బాల లక్ష్మితెలిపారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్రాజేశ్వరి, సీనియర్ అసిస్టెంట్ ప్రసాద్, సందీప్ రెడ్డి, హఫీజ్, రత్నకుమారి, రామకృష్ణారెడ్డి తదితరులున్నారు.

### భూ సమస్యలు ఉన్న రైతులు,

## ప్రజలు రెవెన్యు గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలి

- **జిల్లాలో నేటి నుండి ప్రారంభమైనమూడవ విడత రెవెన్యు సదస్సుల**
- **భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి నూతన రెవెన్యూ చట్టం**
- **జిల్లా పాలనాధికారిరాజర్షి షా**

ఆదిలాబాద్ జూన్03( సమయం న్యూస్) :మంగళవారం నేరడిగొండ మండలం అరెపల్లి, ఇచ్చోడ మండలం ఆడేగాం కే లలోభూ భారతి రెవెన్యు సదస్సులలో జిల్లా పాలనాధికారి రాజర్షి షా, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి తో కలసి దరఖాస్తులను పరిశీలించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన నూతన భూ భారతి రెవెన్యూ చట్టం 2025,రెవెన్యూ గ్రామసభలు ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈరోజుజూన్ 3 వ తేదీ నుండి జూన్ 20 వరకు జిల్లా వ్యాప్తంగా అన్ని రెవెన్యూ గ్రామాలలో సదస్సులు నిర్వహించి భూ సమస్యలు ఉన్నరైతుల వద్ద నుండి దరఖాస్తులు స్వీకరించడం కోసం ఈ సదస్సులను ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఏర్పాటు చేయడం జరిగిందని కలెక్టర్ గ్రామస్తులకు వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా పైలెట్ ప్రాజెక్టులో భాగంగాజిల్లాలోభోరజ్ మండలంలో ఇప్పటికే రెవెన్యూ సదస్సులు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించడం జరిగిందని అన్నారు,ఈ సారి రెండు బృందాలుగా రెవెన్యూసిబ్బందిని నియమించిఉదయం 9 నుండి 4 వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని,ఇప్పటికే స్థానిక తహసీల్దారులు పూర్తిస్థాయిలో సంబంధిత రెవెన్యూ గ్రామాలలో ప్రచారం నిర్వహించి టామ్ టామ్ ద్వారా ప్రజలకు సమాచారం అందించడం జరిగిందన్నారు,ప్రభుత్వం సూచించిన ప్రకారం రెవెన్యూ గ్రామ సభలను పక్కాగా నిర్వహించాలని దరఖాస్తుదారులకు ముందస్తు ఫారాలను ఇవ్వాలని వారి యొక్క దరఖాస్తులను పరిశీలించి స్వీకరించాలన్నారు, సదస్సులలో ప్రత్యేక హెల్ప్ డెస్కులను ఏర్పాటు చేయడం జరిగిందని వాటి ద్వారా దరఖాస్తు దారులకు తగు సూచనలు చేస్తూ దరఖాస్తులను పూరించుటకు



సహకరించాలన్నారు,జిల్లా వ్యాప్తంగా ప్రతీ రోజు వచ్చిన దరఖాస్తుల స్థితిగతులను పరిశీలించి ఆన్లైన్లో నమోదు చేయాలన్నారు,ప్రజలకు అనువైన ప్రదేశాలు గ్రామపంచాయతీ, రైతు వేదికలు, తదితర ప్రదేశాలలో ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని సౌకర్యాలతో రెవెన్యూ సదస్సుల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు పక్కా ప్రణాళికతో సదస్సులు నిర్వహిస్తూ పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండేవిధంగా అన్ని చర్యలు చేపట్టాలని ఆన్నారు. ఈ సదస్సులో భూమికి సంబంధించిన సమస్యలను ఏమైన ఉంటే పరిష్కరించుకోవాలని, అధికారులు మీ గ్రామాలకు వచ్చి సమస్యలను పరిష్కరిస్తారని, గ్రామ ప్రజలువెంటనే అక్కడికక్కడే తమ సమస్యలను పరిష్కరించుకోవచ్చునని , అధికారులు గ్రామాల్లో ఉదయం 9.00 నుండి సాయంత్రం 4.00 గంటల వరకు మీ గ్రామాల్లోనే ఉంటారు గనుక ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని 0ఎర్కొన్నారు. ఈ సదస్సులో నేరడిగొండ, ఇచ్చోడ మండలాల తహసీల్దార్లు, కలిమ్ సత్యనారాయణ, పంచాయితి సెక్రటరి, ఆపరేటర్లు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు



## ఎమ్మెల్యే గా గెలిచిన అనతి కాలంలోనే ప్రజలను వరద ముంపు నుంచి కాపాడిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

హనుమకొండ జూన్03( సమయం న్యూస్) :అతిపెద్ద మురికి మరియు వరద కాలువగా ఉన్న నయిం నగర్ పెద్దమోరి పరివాహక ప్రాంతాన్ని ఈ రోజు ఎమ్మెల్యే నాయిని ఆకస్మికంగా సందర్శించారు.రాజాజీ నగర్ ప్రాంతంలో నిర్మించిన బ్రిడ్జి మరియు నాలా ఇరువైపులా ఉన్న ప్రహరీ నిర్మాణాన్ని,పూడికతీత పనులను పరిశీలించారు.కొన్ని చోట్ల అసంతృప్తిగా ఉన్న పనులపై వెంటనే స్పందించి నాలా పూడికతీత పనులను పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. వర్షాకాలం ప్రారంభం అవుతున్న నేపథ్యంలో వరద ప్రభావిత ప్రాంతాలను నిర్మాణ పనులను పునఃపరిశీలన చేసుకోవాలని సూచించారు.

## రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

- **బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో**


బోధన్ డివిజన్, జూన్ 3, సమయం న్యూస్ : బోధన్ డివిజన్‌లో కొనసాగుతున్న రెవెన్యూ సదస్సుల కార్యక్రమంలో భాగంగా సబ్ కలెక్టర్ వికాస్ మహతో మంగళవారం సాలూర మండలం మందర్నా గ్రామం, పోతంగల్ మండలం తగ్గేల్లీ గ్రామం, బోధన్ మండలం నాగన్పల్లి గ్రామాలలో పర్యటించి గ్రామ సదస్సులను పరిశీలించారు. గ్రామస్థులతో ప్రత్యక్షంగా మాట్లాడి, రెవెన్యూ సంబంధిత సమస్యలు, ఫిర్యాదులపై అడిగి తెలుసుకున్నారు. భూమి సంబంధిత ఏవైనా సమస్యలు ఉన్నపక్షంలో, సంబంధిత తహశీల్దార్‌కు అవసరమైన పత్రాలతో కూడిన దరఖాస్తులు ఇవ్వాలని ప్రజలకు సూచించారు. అందిన దరఖాస్తులను శ్రేణీకృతంగా Format1



లో నమోదు చేయాలని, స్వీకరణ ప్రక్రియను అదే రోజు సాయంత్రం 5:00 గంటలలోపు పూర్తి చేయాలని అధికారులకు కఠినంగా ఆదేశించారు. ఈ సందర్భంగా సాలూర తహశీల్దార్ శశిభూషణ్, పోతంగల్ మండల తహశీల్దార్ గంగాధర్, బోధన్ మండల తాసిల్దార్ విట్టల్ దరఖాస్తులను స్వీకరించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ఈ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని సబ్ కలెక్టర్ పిలుపునిచ్చారు.

## 'పునాస' పత్రికను ఆవిష్కరించిన మంత్రి జూపల్లి కృష్ణారావు

హైదరాబాద్ జూన్ 04(సమయం న్యూస్): తెలంగాణ సాహిత్య అకాడమీ చేస్తున్న కార్యక్రమాలలో' పునాస ' పత్రికను ప్రచురించడం గొప్ప విషయం అనీ, అందులో తెలంగాణ ప్రముఖులైన కొందరి శతజయంతి సందర్భంగా ప్రత్యేక సంచికలు తీసుకురావడం చాలా బాగుందన్నారు మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు. ఈ సందర్భంగా మంత్రివర్యులు మాట్లాడుతూతెలంగాణ సాహిత్య అకాడమీ ప్రచురించిన ఆచార్య బిరుదురాజు రామరాజు ప్రత్యేక సంచిక 'పునాస' ను ఆవిష్కరించారు. రామరాజు లాంటి గొప్ప పండితుడు, పరిశోధకుడు తెలంగాణలో జన్మించడం ఈనేలచేసుకున్నఅదృష్టం అన్నారు.గత సంవత్సరముదాశరథి కృష్ణమాచార్యగారిపైన ఓ ప్రత్యేక



సంచికను ముద్రించినట్లుగానే ఇప్పుడు బిరుదురాజు రామరాజు గారి పైన ఈ ప్రత్యేక సంచికను ప్రచురించినందుకు, ఇలాంటి సాహిత్య పరమైనఅనేక కార్యక్రమాలు చేయడంలోసాహిత్య అకాడమీ కార్యదర్శి బాలాచారి కృషి ఎంతో ఉన్నదనివారిని అభినందిస్తూ వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సాహిత్య అకాడమీ కార్యదర్శి బాలాచారి మరియుకవి యాకుబ్, దినకర్, మరికొందరు కవి మిత్రులతో పాటు సాహిత్య అకాడమీ సిబ్బంది పాల్గొన్నారు.




## అల్ట్రా మారథాన్ కుఎంపికైన తెలంగాణ అథ్లెట్ నవ్య

* **లక్ష రూపాయల ఆర్థిక సాయం అందజేసిన బొటానికల్ గార్డెన్ వాకర్స్ అసోసియేషన్**

అంబర్ పేట, జూన్,3( సమయం న్యూస్) :ఈనెల 8వ తేదీన సౌత్ ఆఫ్రికాలో జరగనున్న 90 కిలోమీటర్లఅల్ట్రా మారథాన్లోపాల్గొనబోతున్నతెలంగాణ అథ్లెట్ నవ్యను స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి అభినందించారు.నల్గొండ జిల్లా చీకటి గూడెంకు చెందిన నవ్య గచ్చిబౌలిస్టేడియంలో సాధన చేస్తోంది. సౌత్ ఆఫ్రికాలో జ1 జూన్ 8 ఆదివారం నాడు జరగబోయే 90 కేఎం ఆల్ట్రా మారథాన్ కు నవ్య ఎంపికైంది. ఈ పోటీలో పాల్గొనడానికినవ్యకు బొటానికల్ గార్డెన్ వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులుభరత్ రెడ్డి, బాల కిషన్ లు లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని నవ్వకు గచ్చిబౌలి స్టేడియంలోని స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి కార్యాలయంలో అందజేశారు.



## ఇందిరమ్మ ఇల్లు నిర్మాణానికి భూమి పూజ

: **పేదల కలను సాకారం చేస్తోన్న కాంగ్రెస్**

బోధన్పట్టణం,జూన్ 3,సమయం న్యూస్ : బోధన్ పట్టణంలోని 37వ వార్డులో మంజూరైన ఇందిరమ్మ ఇల్లు నిర్మాణానికి ఎమ్మెల్యే పొద్దుటూరీ సుదర్శన్ రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం భూమి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. పేదలకు నివాస హక్కును కల్పించాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇల్లు పథకం కింద ఈ నిర్మాణం చేపడుతున్నట్లు నాయకులు తెలిపారు. ఇంటి కలను నెరవేర్చుకునేందుకు ఈ పథకం ఎంతో కొంత ఆర్థిక భద్రతను కల్పిస్తుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాషా మొయినుద్దీన్, ప్రముఖ నాయకులు తూము శరత్ రెడ్డి, అంకు దాము, హరికాంత్ చారి, చిత్రాల ప్రమోద్ కుమార్ (చిన్న), జావిద్, ఖలీమ్ తదితరులు పాల్గొన్నారు. అర్హులైన పేదలకు ఈ పథకం అమలుతో మౌలిక సదుపాయాలు కలుగుతాయని, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు తడబడకుండా అమలవుతున్నాయని నేతలు పేర్కొన్నారు. ఇల్లు కలగలేని కుటుంబాల జీవితాల్లో వెలుగులు నింపడమే తమ ప్రభుత్వ ధ్యేయమన్నారు.



## సీఎం ప్రజావాణి చొరవతో మృతుని కుటుంబానికి అందిన రూ. 4 లక్షల పీ.ఎఫ్.

హైదరాబాద్ జూన్03(సమయం న్యూస్) : ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి, ప్రజావాణి ఇంచార్జ్ చిన్నారెడ్డి, నోడల్ అధికారి దివ్యలకు ధన్యవాదాలు తెలిపిన మృతుని తల్లిదండ్రులు. సీఎం ప్రజావాణి చొరవతో పాల ప్రవీణ్ అనే మృతుని కుటుంబానికి నాలుగు లక్షల రూపాయల ప్రావిడెంట్ ఫండ్ అందింది. మంగళవారం మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్ లో జరిగిన సీఎం ప్రజావాణికి మృతుని తల్లిదండ్రులు పాల నాగేశ్వరరావు, రామలక్ష్మి వచ్చి ఈ విషయాన్ని తెలిపారు. తమను ఆదుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రజావాణి ఇన్చార్జి చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్యలకు మృతుని తల్లిదండ్రులు ధన్యవాదాలు తెలిపారు. హైదరాబాద్ లోని జగద్గిరిగుట్టకు చెందిన పాల ప్రవీణ్ ఒక ప్రైవేట్ సంస్థలో పనిచేస్తుండగా ఐదేళ్ళ క్రితం ప్రమాదవశాత్తు మృతి చెందారు. ఐదేళ్లుగా అధికారుల చుట్టూ తిరిగిన లాభం లేకపోవడంతో మూడు నెలల క్రితం సీఎం ప్రజావాణి కి వచ్చి సమస్యను వివరిస్తూ మృతుని తల్లిదండ్రులు పిటిషన్ ఇచ్చారు. సీఎం ప్రజావాణి ఇన్చార్జి చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ ల ఆధ్వర్యంలో అధికారులు రంగంలోకి దిగి ప్రైవేట్ సంస్థ, పీఎఫ్ అధికారులతో సంప్రదింపులు జరిపారు. మృతుడు ప్రవీణ్ కు రావాల్సిన రూ. 4 లక్షల పీ ఎఫ్ డబ్బులు ఇప్పించారు.

# బడిబాట పై జిల్లా స్థాయి సమన్వయ సమావేశం

* **ఈ విద్య సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలలో విద్యారుల నమోదు శాతం తప్పని సరిగా పెరగాలి.**
* **జిల్లా కలెక్టర్ క్రాంతివల్లూరు.**

సంగారెడ్డి జూన్03(సమయం న్యూస్) : ఈరోజు గౌరవ జిల్లా కలెక్టర్ శ్రీమతి వల్లూరు క్రాంతి గారి అధ్యక్షతనబడిబాట పై జిల్లా స్థాయి సమన్వయ సమావేశం నిర్వహించడం జరిగింది. ఇట్టి సమావేశంలోగౌరవ కలెక్టర్ గారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల నమోదు ఎక్కువ శాతం పెంచేలా బడిబాట కార్యక్రమాన్ని తేదీ 06.06.25 నుండి 19.06.2025 వరకు నిర్దేశించిన షెడ్యూలు ప్రకారం కొనసాగించాలని అందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా ఈనెల ఆరవ తేదీన ఏర్పాటు చేసిన గ్రామ సభలను విజయవంతం చేయాలని అట్టిగ్రామ సభలలో గ్రామంలోని స్వయం సహాయక బృందాలు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు, అంగన్వాడీ టీచర్లు సిబ్బంది గ్రామపంచాయతీ సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రభుత్వ పాఠశాలలలో గ్రామంలోని అందరు విద్యార్థులను చేర్చేలా తీర్మానం చేసుకోవాలని సూచించారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా నిర్దేశించిన రోజు వారి కార్యక్రమాలను అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వారి అందరు ఉపాధ్యాయ సిబ్బందితో కలిసి పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ సంవత్సరం ప్రభుత్వ పాఠశాలలో కచ్చితంగా విద్యార్థులు ప్రవేశాలు పెంచేలా బడీడు పిల్లల తల్లిదండ్రులతో కలిసి వారికి అవగాహన కల్పించి 100% శాతం ప్రవేశాలు పూర్తి చేయాలి.ఈ బడిబాట కార్యక్రమంలో జిల్లా మహిళా సమాఖ్య, మండల మహిళా సమాఖ్య ,స్వయం సహాయక బృందాలు , అంగన్వాడి ఉపాధ్యాయులు



పాల్గొని పెద్ద ఎత్తున పిల్లలని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలి. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, ఏకరూప దుస్తులు, మధ్యాహ్న భోజనము, స్కాలర్షిప్స్, సహాయ ఉపకరణాల గురించి తెలియజేసి తల్లిదండ్రులను పాఠశాల వైపు ఆకర్షితులను చేయాలి. బడి బయట పిల్లలు ఎవరైనా గమనించినట్లయితే వెంటనే అట్టి పిల్లలను సమీప పాఠశాలలలో నమోదు చేయించాలి. ప్రతి గ్రామం బడి బయట పిల్లలు లేని గ్రామంగా చూసుకోవాలి.జిల్లాలోని అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేసి ఈ సంవత్సరం ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల నమోదును పెంచేలా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. ఇట్టి జిల్లా స్థాయి సమన్వయ సమావేశంలో గౌరవ జిల్లా విద్యాధికారి శ్రీ ఎస్ వెంకటేశ్వర్లు, కమిషనర్ లేబర్ డిపార్ట్మెంట్ ,జిల్లా సంక్షేమ అధికారినిగారు, ప్రాజెక్ట్ డైరెక్టర్ మెప్మా,అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డి ఆర్ డి ఏ , జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు, జిల్లా వెనుకబడిన తరగతులు,సాంఘిక సంక్షేమ శాఖ, మైనారిటీ సంక్షేమ శాఖ , వైద్య ఆరోగ్యశాఖ జిల్లా స్థాయి అధికారులు, విద్యాశాఖ పై పని చేస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, సమగ్ర శిక్ష కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాలి

* **ద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ**




సంగారెడ్డి జూన్ 03(సమయం న్యూస్) :జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాల అమలు పై జడ్పీ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మంత్రి దామోదర్ రాజనర్సింహ హాజరై జిల్లా లో అమలవుతున్న వివిధ పతకాల తీరు తెన్నులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ సంగారెడ్డి జిల్లా లో జీరో విద్యుత్ సరఫరా, సబ్సిడీ గ్యాస్,ఇందిరమ్మ ఇండ్లు,రేషన్ కార్డులు,సన్నబియ్యం ,విత్తనాలు, ఎరువులు,వానాకాలంలో ముందస్తు చర్యలు,నూతన రోడ్ల నిర్మాణాలు,గ్రామాల మధ్య రోడ్ల విస్తరణ,రోడ్ల అనుసంధానం, నూతన భవన నిర్మాణాలు,ఆరోగ్య కేంద్రాల్లో మందుల స్టాక్ వివరాలు, ధాన్యం కొనుగోళ్లు, ఇతర అంశాల పై అధికారులను వివరాలు అడిగారు. మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ జీరో విద్యుత్ సరఫరా, సబ్సిడీ గ్యాస్ సిలిండర్లు అర్హులను ఇంకా గుర్తించి అందించాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక పూర్తిగా పారదర్శకంగా జరగాలని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల్లో ఇసుక కొరత లేదన్నారు.ఇంకా ఎవరైనా బేస్మెంట్ పూర్తి చేసిన వారికి చెక్కులు అందించక పోతే చెక్కులు త్వరగా అందించాలన్నారు. అర్హత గల పేదలందరికీ రేషన్ కార్డులు అందించి వారికి సన్నబియ్యం పతకం తో లబ్ది చేకూర్చాలననారు. జిల్లా లోరైతులకు సరిపడా ఎరువులు, విత్తనాలు , అందుబాటులో ఉన్నాయన్నారు. వానాకాలం లో రైతాంగం ముందస్తు చర్యలు తీసుకోవాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. గ్రామాలుఆర్థికం గా బలోపేతం కావాలంటే రోడ్స్ ముఖ్యం అన్నారు. రోడ్స్ అనుసంధానం చేస్తే విద్య ఉపాధి మార్గాలు పెరుగుతాయన్నారు. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలలో మందులు పూర్తి స్థాయిలో నిల్వ ఉండాలన్నారు. అధికారుల సమన్వయంతో జిల్లా ను మరింత అభివృద్ధి వైపు నడపాలన్నారు. ఈ కార్యక్రమం లో అదనపు కలెక్టరు చంద్రశేఖర్, మాధురి, జడ్పీసీఈఓ జానకి రెడ్డి, సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# భూభారతి రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

* **కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు**


నిజామాబాద్, జూన్ 03 (సమయం న్యూస్): భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భూభారతి చట్టం అమలులో భాగంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. డిచ్పల్లి మండలం సుద్దులం, దర్పల్లి మండలం గోవింద్ పల్లి గ్రామాలలో మంగళవారం నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సులలో కలెక్టర్ పాల్గొన్నారు. రైతులతో ముఖాముఖి మాట్లాడి, వారి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. భూ భారతి చట్టంలోని అంశాలను వివరిస్తూ, రైతుల సందేహాలను నివృత్తి చేశారు. భూ సమస్యలు పరిష్కరించి, రైతులకు వారి భూములపై పూర్తి హక్కులు కల్పించేందుకే ప్రభుత్వం భూభారతి చట్టం అమలు చేస్తోందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇప్పటికే మెండోరా మండలంలో పైలెట్ ప్రాతిపదికన రెవెన్యూ సదస్సులు జరిపి, క్షేత్రస్థాయి పరిశీలన పూర్తి చేశామని అన్నారు. ప్రస్తుతం జిల్లాలోని మిగతా 32 మండలాల్లో గల అన్ని రెవెన్యూ గ్రామాలలో ఈ నెల 20వ తేదీ వరకు సదస్సులు నిర్వహించేలా ప్రణాళిక రూపొందించామని తెలిపారు. తహసీల్దార్, నాయబ్ తహసీల్దార్ల నేతృత్వంలో రెండు బృందాలను నెలకొల్పి, ప్రతి రోజు ప్రతి మండలంలో రెండు గ్రామాలలో రెవెన్యూ సదస్సులు జరిపేలా చర్యలు తీసుకున్నామని కలెక్టర్ తెలిపారు. భూ రికార్డులలో పేరు తప్పులు, విస్తీర్ణం హెచ్చు తగ్గులు,వారసత్వ భూములు, భూ స్వభావం తప్పులు, నిషేధిత జాబితాలో ఉన్న భూ సమస్యలు, సర్వే నెంబర్ మిస్సింగ్, పట్టా పాస్ బుక్కులు లేకపోవడం, ప్రభుత్వ భూములను నవీకరించడం, సాదాబైనామా కేసులు, హద్దుల నిర్ధారణ, పార్ట్ బి లో చేర్చిన భూముల సమస్యలు, భూసేకరణ కేసులు తదితర భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు సదస్సులలో స్వీకరించి భూభారతి కొత్త చట్టం ప్రకారం అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, నిర్దేశిత గడువు లోపు సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలకు




అనుగుణంగా ఆగస్టు 14వ తేదీ లోపు భూభారతి కింద వచ్చిన అన్ని అర్జీలను పూర్తి స్థాయిలో పరిష్కరిస్తామని అన్నారు. నిర్ణీత షెడ్యూల్ ను అనుసరిస్తూ ఆయా గ్రామాలలో అధికారులు ఉదయం నుండి సాయంత్రం వరకు అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు. రెవెన్యూ సదస్సుల్లో ప్రభుత్వపరంగా నిర్ణీత ప్రొఫార్మాలో ప్రింట్ చేసిన దరఖాస్తులను అందజేయడం జరుగుతుందని అన్నారు. దరఖాస్తుల స్వీకరణ పూర్తయిన అనంతరం క్షేత్రస్థాయి పరిశీలన, విచారణ కోసం వచ్చే రెవెన్యూ బృందాలకు సహకరించాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా రైతు గుర్తింపు కార్డుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ, హెల్ప్ డెస్క్, జనరల్ డెస్క్ ల వద్ద సదుపాయాలు, సిబ్బంది పనితీరును కలెక్టర్ పరిశీలన జరిపి, అధికారులకు పలు సూచనలు చేశారు. అర్జీలు సమర్పించేందుకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. భూ సంబంధిత సమస్యలు ఉన్న వారు నిర్ణీత ప్రొఫార్మా లో సరైన విధంగా దరఖాస్తు చేసుకునేలా సహకారం అందించాలని హెల్ప్ డెస్క్ సిబ్బందిని ఆదేశించారు. కలెక్టర్ వెంట నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్ర కుమార్, తహశీల్దార్లు సతీష్ రెడ్డి, శాంత, రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

# బక్రీదు పండుగను ప్రశాంతంగా సజావుగా నిర్వహించుకుందాం

జనగాం జూన్03( సమయం న్యూస్) :బక్రీద్ పండుగను ముస్లిం సోదరులు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకునేలా ప్రతి ఒక్కరం సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ కోరారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో బక్రీద్ పండగను పురస్కరించుకొని డిసిపి రాజమహేంద్ర నాయక్ అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్ లతో కలిసి కలెక్టర్ ముస్లిం సోదరులతో హిందువులతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్



మాట్లాడుతూ గోవధ నిషేధం గా పేర్కొన్నారు. గోమాతను పరిరక్షించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.ఎటువంటి వివాదాలు వచ్చిన పరిష్కరించుకోవాలి కానీ వివాదాలకు చోటియ్యరాదన్నారు. పోలీస్ శాఖ విస్తృతంగా తనిఖీలు చేపడుతుందని చెక్ పోస్ట్ లు ఏర్పాటు చేయడం జరిగిందని గోవులను రవాణా చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. పండుగను పురస్కరించుకొని మాంసపు విక్రయాల వద్ద మున్సిపల్ సిబ్బంది పారిశుధ్య మెరుగు కు తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రశాంత వాతావరణంలో బక్రీదు పండుగను విజయవంతంగా నిర్వహించుకునేలా ప్రతి ఒక్కరి సహకారం ఉండాలన్నారు. ఈ సమావేశంలో పశుసంవర్ధక శాఖ అధికారి రాధాకిషన్ మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, పోలీస్ శాఖ అధికారులు ముస్లిం, హిందూ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.





# జిగేల్‌మనిపించే జిలేబీ నెక్లెస్!

పెళ్లో, పేరంటమో మెడ నిండుగా నగలు వేసుకుంటే ఆ అందమే వేరు. అలాగని ఒకటికి మించి మరొకటి పెట్టుకోవడాన్నీ ఇష్టపడటం లేదు. మీరూ అంతేనా! అయితే, మిమ్మల్ని ఈ జిలేబీ నెక్లెస్ కచ్చితంగా మెప్పిస్తుంది. జిలేబీ ఏంటి, నెక్లెస్ ఏంటి అనుకుంటున్నారా? మనందరం వేడివేడిగా తినడానికి ఇష్టపడే తియ్యని జిలేబీ మాదిరిగానే ఈ నెక్లెస్ పట్టీనీ డిజైన్ చేస్తున్నారు. దాన్ని పోలి ఉంటుందనే ఈ పేరొచ్చింది. అటు సంప్రదాయాన్నీ, ఇటు సౌందర్యాన్నీ ప్రతిబింబించేలా ఈ నెక్లెస్‌లను తీర్చిదిద్దుతున్నారు. ఈ పసిడి నగకు కుందన్లు, నవరత్నాలు, రాళ్లూ... వంటివి అద్దడంతో... ఒక్కటి పెట్టుకున్నా ధగధగలాడిపోవచ్చు. ఈ నెక్లెస్‌కి గుత్తపూసలు, మామిడిపిందెలు, బొట్లు... వంటి అలంకరణలు చేర్చి కొత్తందాలను సృష్టిస్తున్నారు. వీటిని ఓసారి మీరూ చూసేయండి.







# ఎరువుకు ఎసరు..

తోటల్లో మొక్కలకు పోషకాలన్నీ భూమి నుంచే అందుతాయి. కానీ, బాల్కనీల్లో పెంచుకునే మొక్కలకు కుండీల్లోని మట్టే కీలకం. కాబట్టి ఈ విషయంలో సరైన జాగ్రత్తలు తీసుకోవాలి. ఇక నగరవాసులు ఎక్కువగా కుండీల్లోనే మొక్కలు పెంచుకుంటారు. వాటిని ఎంతో అపురూపంగా చూసుకుంటారు. వేసవిలో అవి ఎండిపోవద్దని ఉదయం – సాయంత్రం నీళ్లు పోస్తుంటారు. అయితే, ఇలా నీళ్లు పట్టడం వల్ల కుండీలో మట్టి సారం కోల్పోతుంది.

అందులోని పోషకాలు నీటిలో కరిగిపోయి.. డ్రైన్ నుంచి కిందికి వెళ్లిపోతాయి. దాంతో, మొక్కలకు సరైన పోషణ కరువై.. అవి ఎండిపోయే ప్రమాదం ఉంటుంది. కాబట్టి, కుండీల్లోని మట్టికి కూడా సరైన పోషణ అందేలా చూసుకోవాలి. ఇందుకోసం ఎర్రమట్టి, కోకోపీట్, వర్మి కంపోస్ట్, నాచుతో తయారైన 'నేచురల్ పాటింగ్ మిక్స్'తో కుండీలను నింపుకోవాలి. కనీసం ప్రతి రెండు వారాలకు ఒక్కసారైనా నీటిలో కరిగే ఎరువులు వేయాలి. కుండీలో మొక్కను బట్టి.. ఎరువులు అందించాలి. ఇలా చేయడం వల్ల కుండీల్లో మొక్కలకు కావాల్సిన పోషకాలన్నీ అందుతాయి. తద్వారా అవి ఆరోగ్యంగా పెరుగుతాయి.

